నిర్ణీత కాలవ్యవధిలోగా వినతులు పరిష్కరించాలి



- కలెక్టరేట్ స్పందన కు 244 దరఖాస్తులు
- జగనన్నకు చెబుదాం వినతుల పరిష్కార విజయగాధలను తయారుచేయాలి

విశాలాంధ్ర-విజయనగరం: జగనన్నకు చెబుదాంలో ఆయా ప్రభుత్వ శాఖలకు వచ్చిన వినతులను నిర్ణీత కాలవ్యవధిలోగా, అర్జీ దారులు సంతృప్తి చెందే విధంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వినతుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. వినతులు స్వీకరించినప్పటి నుంచి కింది స్థాయి సిబ్బంది ఆయా వినతులను ఏవిధంగా పరిష్కరిస్తున్నారు, ఆయా అర్జీదారుల కోరిన విధంగా అర్జీ పరిష్కారం అవుతున్నదీ లేనిదీ పర్యవేక్షణ చేయాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, మండల ప్రత్యేకాధికారులు తమ పరిధిలో వచ్చిన వినతుల పరిష్కారంపై నివేదికలను అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. రీ ఓపెన్ అయిన కేస్ లను కూడా నిర్దేశిక్త గడువు లోగా పరిషారం అయ్యేలా చూడాల న్నారు. లాగిన్‌లో ఇంకా చూడ వల సిన వాటి సంఖ్యతగ్గాలని, ప్రతి రోజు అధికారులు స్పందన లాగిన్ లో చూడాలని ఆదేశించారు. పరిష్కారం అయిన వినతుల నుండి సంతృప్తి నివేదిక తీసు కోవడం తో పాటు అర్జీ దారు ఇంటికి వెళ్లి ఈకేవైసి కూడా చేయాలని తెలిపారు. వచ్చే సోమవారానికి పరిష్కారం అయిన వినతుల విజయ గాధలను తయారు చేసి ప్రెజెం టేషన్ ఇవ్వాలని అన్నారు. సోమవారం జగనన్నకు చెపుదాం కార్యక్రమం లో వినతు లను కలెక్టర్ నాగలక్ష్మి తో పాటు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్.డి.ఓ. ఎం.వి.సూర్యకళ, డిప్యూటీ కలెక్టర్‌లు పద్మలత, సూర్యనారాయణ, సుదర్శన దొర తదితరులు స్వీకరించారు. ఈ వారం అత్యధికంగా 244 వినతులు అందాయి. రెవిన్యూ శాఖకు సంబంధించి 150 వినతులు అందగా, డి.ఆర్.డి.ఎ కు 20, వైద్య శాఖ కు 7, గ్రామ, వార్డు సచివాలయాలకు 20, జిల్లా పంచాయతి అధికారి కి 13, మున్సిపల్ శాఖకు 14, హౌసింగ్ కు 15, విద్యుత శాఖ కు 5 చొప్పున వినతులు అందాయి.

ప్రజలపై ఆరువేల కోట్ల విద్యుత్ భారం రద్దు చేయాలి

ప్రజా ఉద్యమాలపై నిర్బంధం విడనాడాలి
రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్షాల డిమాండ్



విశాలాంధ్ర-విజయనగరం: రాష్ట్ర ప్రజలపై ట్రూ అఫ్ చార్జీల పేరిట వేసిన 6 వేల కోట్ల రూపాయల విద్యుత్ చార్జీల భారాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, కేంద్రం లో బీజేపీ, మోడీ విద్యుత్ సంస్కరణలు బిల్లు రద్దు చేయాలని , ప్రజా ఉద్యమాలు పై నిర్బంధం విడనాడాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ కార్యాలయంలో సోమవారం వామపక్షాలు ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సిపిఎం పార్టీ జిల్లాకార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో శంకరరావు,, సిపిఐ జిల్లా కార్యదర్శి ఓమ్మి రమణ,,సిపిఐ ఎంఎల్జి ల్లా నాయకులు బెహరా శంక్రరావు లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధానాలు ఫలితంగా రోజు రోజుకి విద్యుత్ ధరలు పెరుగుతూ పేద మధ్యతరగతి , పేద ప్రజానీకానికి ఆర్థిక ఇబ్బందులకు కారణమవుతున్నాయని అన్నారు. ఇప్పటికే ప్రజలు పెరిగిన ధరలతో సతమతమవుతుంటే , మూలుగే నక్క పైన తాటిపండు పడినట్లు విద్యుత్ చార్జీలను కూడా పెంచి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల నడ్డి విరుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలు తగ్గించాలని, కోరుతూ,విద్యుత్ ప్రైవేటీకరణ ఆపాలని, ట్రూ అఫ్ చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలు భారాలు పెంపు ఆపాలని, అలాగే ప్రజా ఉద్యమాలు పై నిర్బంధాన్ని ఆపాలని కొరుతూ 27న కలెక్టరేట్ వద్ద దర్నా చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ ధర్నా లో.దీసీలో ప్రజలు పాల్గొనాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ రౌండ్ టేబుల్ లో ఐద్వా జిల్లకార్యధర్శి,పీ.రమణమ్మ , మహిళా సమాఖ్య అధ్యక్షులు, భాయి రమనమ్మ,సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.రమణ, ఎఐఎస్ ఎఫ్ కార్యదర్శి భూషణం, కేసిపిస్ జిల్లా కార్యదర్శి అనంద్, పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామచంద్రరావు. రైతు, వ్యవసాయ కార్మిక సంఘం,నాయకులు తది తరులు పాల్గొన్నారు.

సీతంలో ఇండక్షన్ ప్రోగ్రాం ప్రారంభం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : సీతంలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభోత్సవం, ఇండక్షన్ ప్రోగ్రాం జరిగింది. ఈ ప్రారంభోత్సవ సభకు ముఖ్య అతిధులుగా జేఎన్టీయూ జీవీ రిజిస్టర్ ప్రొఫెసర్ జి.జయసుమ, సీతం సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝూన్సీ విచ్చేశారు ఈ సందర్భంగా ప్రొఫెసర్ జి. జయసుధ మాట్లాడుతూ సమయాన్ని సద్వినియోగం చేసుకునేవారే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించగలరని విద్యార్థులంతా సమయాన్ని సద్వినియోగ పరుచుకోవడం అలవర్చు కోవాలని, ప్రాంగణ నియామకాలే లక్ష్యంగా నైపుణ్యాలను పెంచుకోవాలని అన్నారు. అనంతరం డాక్టర్ బొత్స ఝూన్సీ మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థుల చదువును పర్యవేక్షిస్తూ ఉండాలని ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ ల ప్రాముఖ్యతను విస్తరిస్తూ విద్యార్థులు కళాశాలలో గల ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్‌లలో భాగస్వాములు కావాలని, డాక్టర్ మజ్జి శశిభూషణ్ రావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటుగా సమకాలీన పరిస్థితులకు అవసరమైన సర్టిఫికెట్ కోర్సులు కూడా చేస్తూ ఉండాలని అన్నారు. బొత్స పూజిత మాట్లాడుతూ విద్యార్థులు భావవ్యక్తీకరణ నైపుణ్యాలను వృద్ధిచేసుకోవాలని తద్వారా ప్రాంగణ నియామకాలు సాధించడం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వి.రామమూర్తి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రన్నను అక్రమంగా అరెస్ట్ చేశారు : కిమిడి నాగార్జున

విశాలాంధ్ర-చీపురుపల్లి: టిడిపి అధినేత చంద్రన్నను అక్రమంగా అరెస్ట్ చేశారని విజయనగరం జిల్లా టిడిపి అధ్యక్షులు కమిటీ నాగార్జున అన్నారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ చంద్రన్న పై స్కిల్ డెవలప్మెంట్ కేసు అంటూ వైసిపి నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలో సోమవారం గరివిడి పట్టణ టిడిపి నాయకులు రెడ్డి గోవింద, తూట శ్రీనివా సరావు, వైగాల సత్యం, సత్తిరాజు, రామరత్నం, రెడ్డి విజయలక్ష్మి, కోటిపల్లి పద్మ, ముదు నూరు రమాదేవి, వేంకటపతి రాజు, కలిశెట్టి సూరప్పుడు, దుక్క రామకృష్ణ, తూట సూరిబాబు, శ్రీనివాసరావు పిన్నడ, గంట్రెటి పెంటయ్య దొర, గుసిడి రమణ, సీరపు శ్రీనివాసరావు,కొండపర్తి గురువులు, దన్నన అప్పన్న, సత్యం, తదితరులు దీక్ష చేశారు. కార్యక్రమంలో పైల బలరాం, సారేపాక సురేష్ బాబు, మహంతి రమణ మూర్తి, బలగం వెంకట రావు, మహంతి అప్పల నాయుడు,మండల అప్పలనాయుడు, అరతి సాహు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపిపి ఉప్పాడ అనూష రెడ్డికి ఘన సన్మానం

విశాలాంధ్ర-భోగాపురం: మండల పరిషత్ అధ్యక్షురాలిగా పదవీ బాధ్యతలు చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కుమారి ఉప్పాడ అనూష రెడ్డిని మండల అధికారులు, ఉద్యోగులు సోమవారం ఘనంగా సత్కరించారు. మండల అధికారులు మాట్లాడుతూ అను నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ మండలంలో ప్రజా సమస్యలు పరిష్కారానికి, అభివృద్ధికి కృషి చేస్తు మండలాన్ని విజయపథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. ఎం పి పి సలహాదారు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ మండలంలో అన్ని విభాగాలు ఒక కుటుంబంలా కష్టించి పనిచేసి మండలాన్ని రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వచ్చేటట్టు చేశారన్నారు. ఎంపిపి అనూష రెడ్డి మాట్లాడుతూ మండలంలో సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా మండల ప్రజలందరికి అందిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బంగార్రాజు, ఎంపీడీఓ అప్పలనాయుడు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రీ సర్వేలో పేదల భూములకు జరుగుతున్న అన్యాయంపై చర్యలు తీసుకోండి

గ్రీవెన్స్ లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ఫిర్యాదు

విశాలాంధ్ర -విజయనగరం: జిల్లాలో రామభద్రపురం మండలం కొట్టక్కి గ్రామ పరిధిలో నిరుపేదలకు ఇచ్చిన భూమి వివరాలను రీ సర్వేలో తక్కువగా నమోదు చూపారని విచారణ చేసి పేదలకు న్యాయం చేయాలని కోరుతూ సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ సోమవారం గ్రీవెన్స్ లో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ కు వినతిపత్రం అందజేశారు. కొట్టక్కి గ్రామ సర్వే నెంబర్ 537లో 2005-06లో ఒక్కొక్కరికి ఎకరా వంతున 65మందికి ప్రభుత్వం పట్టాలిచ్చిందని, అయితే రీ సర్వే చేసిన మండల రెవెన్యూ అధికారులు ఒక్కొక్కరి పేర .. 60-70 సెంట్లు మాత్రమే నమోదు చేశారని ఒమ్మి రమణ పేర్కొన్నారు. ఎంత భూమికైతే పట్టా ఇచ్చారో అంత భూమికే రీ సర్వే చేసి హక్కులు కల్పించాలని మండల తహాశీల్దార్ ను ఇప్పటికే కోరడం జరిగిందన్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పేదలకు న్యాయం చేయాలని ఒమ్మి రమణ కోరారు.అలాగే సాలూరు కు చెందిన టొంపల నాగరాజు, బాలమ్మ లు ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులని,వారి పిల్లలు కూడా ప్రభుత్వ ఉద్యోగులైనప్పటి కీ రీ సర్వే చేసినప్పుడు వీరిపేర సర్వే నెంబర్ 537లో 30 ఎకరాలు విఆర్వో నమోదు చేశారని ఫిర్యాదు చేశారు.ఈ వివరాలను మండల తహాశీల్దార్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని ఒమ్మి రమణ పేర్కొన్నారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మితే సహించం

సిపిఐ జిల్లా కార్యదర్శి ఓమ్మి రమణ

విశాలాంధ్ర-రామభద్రపురం: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ మన దేశ సంపదని ఆ ఫ్యాక్టరీని అమ్మే హక్కు ఎవరికీ లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అన్నారు. సోమవారం విశాఖ నగరం నుంచి బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులకు వామపక్ష నాయకులకు మండల కేంద్రంలో మధ్యాహ్నం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దేశ సంపదను అమ్ముకొని కార్పొరేట్ శక్తులు జేబులు నింపుకోవడమే తప్ప ప్రజల శ్రేయస్సు ఆలోచించడం లేదని ఆరోపించారు. వందల మంది కార్మికులు పనిచేసే విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మితే నరేంద్ర మోడీకి వచ్చే ఎన్నికలలో తగిన గుణపాఠం ప్రజలు బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఎంతోమంది అమరవీరులు పోరాట ఫలితంగా సాధించుకున్న ఉక్కు ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వం మోదీ అనుచరులకు అమ్మేసి కార్పొరేట్ శక్తుల వద్ద నుంచి పార్టీ ఫండ్ రూపంలో విరాళాలు సేకరించి ఆ డబ్బును ఎన్నికలలో ఖర్చు పెడుతుందన్నారు. ఫ్యాక్టరీ ని ప్రైవేట్ వ్యక్తుల జేబుల్లో పెడితే వామపక్షాలు చూస్తూ ఊరుకోగానే హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

మున్సిపల్ వర్కర్స్ యూనియన్
జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగరాజు, కామేష్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు వెంటనే పర్మినెంట్ చేసి కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ రంగరాజు, జలగడుగుల కామేష్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అనేక ఇబ్బందులకు గురి అవుతూ మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కార్మికులకు పర్మినెంట్ చేసి సమాన పనికి సమాన వేతనం చెల్లిం చాలన్నారు. కార్మికులకు జిపిఎఫ్ ఖాతాలు ప్రారంభించి 10 లక్షల ప్రమాద బీమా అమలుకు చర్యలు చేపట్టాలన్నారు. సహజ మరణం పొందిన కార్మిక కుటుంబాలకు ఐదు లక్షల రూపాయలు పరిహారం అందించాలని కార్మికుల కుటుంబాలకు ఆరోగ్య భీమా వర్తింపజేసేలా చూడాలన్నారు. మున్సిపల్ కార్మికులకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం కాకుంటే రానున్న కాలంలో పోరాటాలను ఉదృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్లాత్ డ్రైవర్స్ అధ్యక్షులు పొడుగు రామకృష్ణ, టి శ్రీను, డి శ్యామ్, డి గణేష్, బి శంకర్, డి రాజు తదితర మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌లో ఆయిల్ ట్యాంక్ శుభ్రం చేస్తుండగా ఊపిరాడక ఇరువురు మృతి

విశాలాంధ్ర-బొబ్బిలి: విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం మెట్టవలస గ్రామ పరిధి గ్రోత్ సెంటర్ ఎస్సార్ పెట్రోల్ బంక్ లో గత కొంతకాలంగా వాడకుండా ఉన్న పెట్రోల్ నిలువచేసే ట్యాంక్ క్లీన్ చేస్తుండంగా ప్రమాదవశాత్తు ఇరువురు వ్యక్తులు అందులోనే మృతి చెందారు. ప్రమాద సంఘటనపై స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి శేష శైలజ, తాసిల్దార్ డోల రాజేశ్వరరావు, ఆర్ ఐ చక్రవర్తి, పట్టణ సీఐ నాగేశ్వరరావు, ఎస్సైలు జ్ఞాన ప్రసాద్ చదలవాడ సత్యనారాయణ లో సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు బొబ్బిలి మండలం చింతాడ గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ పెద్దింటి పోలినాయుడు(55) సోమవారం ఎస్సార్ పెట్రోల్ బంక్ యజమాని సత్యనారాయణ రెడ్డి పెట్రోల్ బంకు వద్ద పారతో మట్టిని తవ్వాలని చెప్పి పనికి పిలిపించాడని బంకు వద్ద గత కొంతకాలంగా వాడకుండా ఉండిపోయిన పెట్రోల్ నిలువచేసే ట్యాంక్ శుభ్రం చేయాలని అందులో ఉన్న ఆయిల్ అంతా తీసివేయాలని పోల్ నాయుడు బకెట్ తోడుతుండగా బంక్ యజమాని ట్యాంక్ లోకి దిగి తీస్తే పని వేగం అవుతుందని చెప్పడంతో మృతుడు పోలినాయుడు అందులో దిగి ఊపిరాడక మృతిచెందాడు. ప్రమాద సంఘటనపై రోడ్డు పక్కనే గత వారం రోజులుగా లారీ వద్ద ఉన్న బీహార్ పాట్నాకు చెందిన వ్యక్తి ఆయిల్ ట్యాంకులో దిగిన వ్యక్తి తిరిగి బయటికి రాలేదని సాయం చేయడానికి అని వెళ్లి అతను కూడా ఊపిరాడక ట్యాంకులోనే మృతి చెందాడు. ప్రమాద సంఘటనపై స్థానిక అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థానానికి చేరుకొని మృతి చెందిన ఇరువురు మృతదేహాలను బయటకు తీయించారు. మృతుడు పోలినాయుడికి భార్య సీతారాం పిల్లలు సురేష్, కుమార్తె పోలీస్ ఇరువురికి వివాహం అయినట్లు మృతుడు బంధువులు విలేకరులకు తెలిపారు. మృతుడు భార్య సీతారాం ఫిర్యాదు మేరకు బొబ్బిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్ చేస్తున్నట్లు తెలిపారు. బీహార్ పాట్నాకు చెందిన లారీ డ్రైవర్ మృతి పై కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు పోలీసులు తెలిపారు.

హెక్తాన్ పోటీలో 30 ప్రాజెక్టులు ఎంపిక

విశాలాంధ్ర-నెల్లిమర్ల: సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏకాదాటిగా 72 గంటలపాటు నిర్వహించిన 'హెక్తాన్' పోటీలో 30 ప్రాజెక్టులు ఎంపికై నట్టు ఐఐసి (ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్) అధ్యక్షులు డాక్టర్ సన్నిడియోల్ తెలిపారు. సోమవారం జ్యూరీ సభ్యుల పరిశీలన తరువాత ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ పోటీలకు జ్యూరీగా ఎన్ఆర్డిసి నుంచి డాక్టర్ బిజయ్ కుమార్ సాహు, నాస్కామ్ నుంచి స్ట్రాటజిక్ ప్లానింగ్ హెడ్ పూజా విద్యా శంకర్, విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి ఎల్ఎంఎంఎం హెడ్ డాక్టర్ ఎంఎన్ ప్రసాద్, ఎపిఐఎస్ నుంచి చిమట లావణ్యలతోపాటు జెఎన్ టియు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయసుమ ప్రాజెక్టులను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు చేపట్టిన ప్రాజెక్టులలో బ్లాక్ చైన్ అండ్ సైబర్ సెక్యూరిటీ, స్మార్ట్ ఎడ్యుకేషన్, స్మార్ట్ ఆటోమేషన్, అగ్రిటెక్, రోబోటిక్స్ అండ్ డ్రోన్స్ తది తర అంశాలకు సంబంధించి 51 అంశాలపై ప్రాజెక్టులు చేపట్టగా వాటిలో 30 ప్రాజెక్టులు ఎంపికపై సెంచూరియన్ వీసీ ప్రొ॥ జిఎస్ఎన్ రాజు, వీసీ ప్రొ॥ ప్రశాంతకుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి విద్యార్థులను అభినందించారు. గిరిజన వర్సిటీ నుంచి ప్రొఫెసర్ శరత్ చంద్ర, డాక్టర్ ఎన్వి సూర్యనారాయణ, సీతం ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు విద్యార్థులను అభినందించారు.

పార్వతీపురం మన్యం

ఆరోగ్యశ్రీ డిసిగా కొయ్యాన అప్పారావు

విశాలాంధ్ర-పార్వతీపురం: వై.యస్.ఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయ అధికారిగా డా.కొయ్యాన అప్పారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జాయిన్ అయ్యాక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. జిల్లాలో వై.యస్.ఆర్ ఆరోగ్యశ్రీ క్రింద ప్రజలకు మంచి వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నిపుణులైన వైద్యుల భాగస్వామ్యాన్ని సమన్వయం చేయాలని ఆయన అన్నారు. కొయ్యాన అప్పారావు శ్రీకాకుళం జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పలు హెూదాల్లో సేవలు అందించారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలో సమర్థవంతంగా, ధైర్యంగా వైద్యసేవలు అందించడం, సమన్వయపరచడంలో ప్రముఖపాత్ర పోషించి ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు.

స్పందన వినతులను సత్వరమే పరిష్కరించండి : కలెక్టర్



విశాలాంధ్ర-పార్వతీపురం: జగనన్నకి చెబుదాం కార్యక్రమానికి ప్రజలనుండి వచ్చిన వినతులను సత్వరమే పూర్తి స్థాయిలో పరిష్కరించి స్పందన పిర్యాదు దారులను సంతృప్తి పరచాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మంది రంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్ పాల్గొ న్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన వినతులను ప్రతిష్టాత్మకంగా తీసుకొని శాఖలవారీగా సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణుచరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకటరావులతో కలిసి ప్రజలు నుండి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు నుండి 187 దరఖాస్తులు అందగా అధికంగా భూసమస్యలు పరిష్కరించాలని అర్జీలు అందజేశారన్నారు. ఈకార్యక్రమంలో డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి. కిరణ్ కుమార్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామచంద్రరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు,జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకరరావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ,జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్. ప్రేమ్ కుమార్, డి. ఎమ్. సివిల్ సప్లై నాయక్,జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్, ఇతర శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడీల అక్రమ అరెస్టులపై వామపక్షాల ఖండన

విశాలాంధ్ర-బెలగాం: అంగన్వాడి వర్కర్స్ &హెల్పర్స్ యూనియన్ కార్మికులు న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి టి. జీవరత్నం, సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు బి. నర్సింగరావు, సిపిఐ ఎంఎల్ నాయకులు పి. శ్రీనునాయుడు, సిపిఎంఎల్ లిబరేషన్ నాయకులు పి.సంగం అన్నారు. ఈమేరకు స్థానిక సుందరయ్య భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పెన్షన్ సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్లు ఇవ్వాలని తెలంగాణాతో సమానంగా జీతాలు పెంచాలని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా విజయవాడలో ధర్నాకు పిలుపునిస్తే, ఉగ్రవాదులపై విధించే షరతులు పెట్టి వారిని అక్రమంగా అరెస్టులు చేసి నిర్బంధించి, ఇళ్లల్లో చొరబడి నానా ఇబ్బందులు పెట్టి రాజ్యాంగ సూత్రాలను ఉల్లంఘించారని, రాష్ట్ర ప్రభుత్వం, పోలీసుల నిర్బంధాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ప్రజా పోరాటాలపై ప్రభుత్వ నిర్బంధం విడనాడకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి : వామపక్షాల డిమాండ్

విశాలాంధ్ర-బెలగాం: సిపిఎం పార్టీ ఆఫీసు బెలగాం సుందరయ్య భవనంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవరత్నం అధ్యక్షతన వామపక్ష పార్టీల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని స్లాబ్ రేట్లు మార్చడం వల్ల విపరీతంగా విద్యుత్ ఛార్జీలు పెరగటంతో ప్రజల గగ్గోలు పెడుతున్నారన్నారు. ఈ పెంచిన చార్జీలు తగ్గించాలని కోరారు. స్మార్ట్ మీటర్ల వలన గంట గంటకు విద్యుత్ చార్జీలు పెరగటంతో ప్రజలకు ఇబ్బందులు పెడుతున్నారన్నారు. గత విద్యుత్ పోరాట స్ఫూర్తితో ప్రభుత్వాలు విద్యుత్ చార్జీలు పెంచలేదని, జగన్మోహన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకు వెళుతున్నాననే పేరుతో మాట తప్పారు మడమ తిప్పారు విద్యుత్ చార్జీలు విపరీతంగా పెంచారు. దీనివల్ల చిన్న పరిశ్రమలు వ్యాపారాలు విపరీతంగా దెబ్బతింటున్నాయి పెంచిన చార్జీలు తగ్గించాలని నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రాజకీయ పార్టీలు ,ప్రజా సంఘాలు ప్రజా సమస్యలపై చేస్తున్న ఉద్యమాలపై తీవ్ర నిర్బంధాన్ని ప్రభుత్వం ప్రయోగిస్తుందన్నారు. శాంతియుత ధర్నాలు నిరసనలు తెలియజేస్తున్న వారిపై తీవ్ర నిర్బంధం ప్రయోగిస్తుందని, ఈ నిర్బంధాలకు నిరసనగా, పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈనెల 27న పార్వతీపురం కలెక్టర్ ఆఫీస్ వద్ద నిరసన ధర్నాలో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని వామపక్షాల నాయకులు కోరారు. అంగన్వాడీల డిమాండ్లు పరిష్కరించాలని పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని శాంతియుతంగా ధర్నాలకు కూడా పిలుపునిస్తే జిల్లాలో ఎక్కడికక్కడ ఇళ్లకు వెళ్లి నిర్బంధించడం , అరెస్టులు చేయడం ధర్నాకు వచ్చిన వారిని పోలీస్ స్టేషన్ లోనికి తరలించడం ప్రజాస్వామ్య హక్కులను భంగం కలిగించడమేనని, ఈ దుర్మార్గపు చర్యను వామపక్ష పార్టీలు నాయకులు తీవ్రంగా ఖండించారు.

జోగింపేట గ్రామంలో జిజిఎంపి పనులు



విశాలాంధ్ర-సీతానగరం: మండలం లోని ఎమ్మెల్యే జోగారావు సూచనలు మేరకు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో గుర్తించిన పనులను సర్పంచ్ కె.సింహాచలం ఆధ్వర్యంలో సీసీ రోడ్ నిర్మాణంకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.ఈకార్యక్రమంలో వార్డ్ మెంబర్లు, సచివాలయంసిబ్బంది ,ప్రజలు పాల్గొన్నారు.

విద్యా బోధనలో తెలుగు భాషోపాధ్యాయుని పాత్ర కీలకం



విశాలాంధ్ర-సీతంపేట: నూతన విద్యావిధానంలో భోధన సమర్థవం తంగా జరపడం కోసం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కల్పనాకుమారి ఆదేశం మేరకు ఆశ్రమ పాఠశాలల, గురుకులం లో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయులకు, సీతంపేట బాలికల ఆశ్రమ పాఠశాలల కోర్స్ డైరెక్టర్ ఉప విద్యాశాఖ అధికారి లిల్లీ రాణి ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరి గింది. కార్యక్రమంలో డిఆర్‌పి లుగా ఎం.పి కోటిబాబు, ఏ.కామేశ్వరరావు, కుర్మచార్యులు, రామకృష్ణ, గోపాలరావు, పసాద్, దిలీప్పట్నాయక్, కైలసరావులు వ్యవహరించారు. పాఠ్య ప్రణాళిక, గద్యబోధన,నూతన ప్రశ్న పత్రం పై అవగాహన, అల0కారాలు, పద్యబోధనలో మెలకువలు, వ్యాకరణ అంశాల అవశ్యకత ,బృంద చర్చ, బోధన పైన చర్చించారు. సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు.డీడీ మంగవేణి పర్యవేక్షణల అధికారులు జిసిడిఓ రాములమ్మ, 86 మందితెలుగు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామినాయుడు వలస పరిసరాల్లో ఏనుగుల గుంపు



విశాలాంధ్ర-కురుపాం: ఏడు ఏనుగుల గుంపు జియ్యమ్మవలస మండలం రామినాయుడు వలస పరిసరాల్లో కలియతిరుగుతూ ప్రజల్ని భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఏసమయంలో ఏగ్రామం పైకి దాడి చేస్తాయోననీ ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని జీవిస్తున్నారు. అసలే వ్యవసాయ సీజన్ కావటంతో పొలాలకు వెళ్ళాలంటే భయపడుతున్నారు. రాత్రి పూట వాహనదారులు తగిన జాగ్రత్తలు పాటిస్తూ ప్రయాణంచేయాలని, తగు సూచనలు పాటించాలని అటవీశాఖ అధికారులు సూచించారు.

వెలమవారివీధిలో గణనాధునికి పాలాభిషేకం



విశాలాంధ్ర-సీతానగరం: మండల కేంద్రంలోని వెలమవారివీదిలో సోమవారం రాత్రి వినాయకునికి ప్రత్యేకపూజలు నిర్వహించి పాలాభిషేకంను ఘనంగ జరిపారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొని వినాయకునికి పూజలుచేసి ప్రసాదాలు స్వీకరించారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చెలికాని వెంకటగోపాల కృష్ణ, ఎస్. కన్నారావుల ఆద్వర్యంలో ఈ కార్యక్రమం జరరగా మండల కేంద్రంలోని ప్రముఖులు, మహిళాభక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఇదిలా ఉండగా గత రెండురోజులుగా సుంకరివీది, కుమ్మరివీధి వినాయకచవితి కమిటీ సభ్యుల ఆద్వర్యంలో కూడా పాలాభిషేకాలను నిర్వహించారు. సోమవారం అన్న సంతర్పణ కార్యక్రమాలు జరిగాయి.

జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో స్పందన

విశాలాంధ్ర-పార్వతీపురం: మన్యం జిల్లా పోలీసు ప్రధానకార్యాలయంలో స్పందన (గ్రీవెన్సు డే) కార్యక్రమంను జిల్లాఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఆయనతోపాటు అదనపు ఎస్పీ డాక్టరు దిలీప్,దిశా డిఎస్పీహర్షితలు కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని, సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని ఆదేశించారు.స్పందనలో ఫిర్యాదు చేసిన వ్యక్తి పదేపదే పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉండకూడదని, బాధితులకు చట్టపరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.స్పందనా పిర్యాదులకు సంబంధించిన తీసుకున్న నిర్ణయనివేదికను కూడా జిల్లా పోలీసు ప్రదానకార్యాలయానికి వెంటనే పంపాలని అధికారులను ఆదేశించారు. తొమ్మిది మంది నుండి పిర్యాదులు వచ్చినట్లు తెలిపారు.ఈస్పందన కార్యక్రమంలో వారితో పాటు ఎస్బి సిఐ సిఎచ్. లక్ష్మణ రావు,డి.సి.ఆర్.బి సిఐ ఎన్వి ప్రభాకర రావు,ఎస్ఐ పాపారావు సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



విశాలాంధ్ర-బెలగాం : ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం జీవితానికి భరోసా లేని సిపిఎస్ ను రద్దు చేయమని కోరితే ప్రభుత్వం న్యాయబద్ధమైన కోరికను పక్కన పెట్టి మరో ప్రత్యామ్నాయంగా సిపిఎస్ కంటే దారుణమైన, ఎందుకు పనికిరాని జిపిఎస్ విధానాన్ని ప్రవేశపెట్టి సిపిఎస్ ను రద్దుచేసినట్టు ఘనంగా ప్రకటించుకుందని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నాయకులు విమర్శించారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఉద్యోగులకు ఏమాత్రం అంగీకారం కాని జిపిఎస్ ని ఈరోజు చట్టం ద్వారా బలవంతంగా రుద్దటానికి చేస్తున్న ప్రయత్నానికి వ్యతిరేకంగా ప్రభుత్వ ఉద్యోగులంతా కూడా నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నప్పటికీ ప్రభుత్వం ఉద్యోగుల అభ్యర్థనలను ప్రక్కనపెట్టి తన పంథాలో మొండిగా ముందుకు సాగుతుందని, ఈ దశలో మరో ప్రత్యామ్నాయం లేక ఈరోజు జిల్లా కలెక్టరేట్ల ముందు చలో కలెక్టరేట్ లో భాగంగా చలో కలెక్టరేట్ నిర్వహించి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి విన్నవించుకున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన వారంలో సిపిఎస్ రద్దు చేస్తామని ప్రతిపక్షంలో వున్నప్పుడు ఇచ్చిన హామీని మరచి 4 సంవత్సరాల అధికారం తరువాత ఇప్పుడు జిపిఎస్ అనే కొత్త విధానాన్ని ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలు వ్యతిరేకిస్తున్నా కూడా బలవంతంగా ప్రభుత్వం ప్రతిపా దించడం క్యాబినెట్ అంగీకారం తెలపడం ఉపాధ్యాయ ఉద్యోగ వర్గాలను మోసం చేయడమేనన్నారు. ఉద్యోగులకు ఏమాత్రం ఆమోదయోగ్యం కాని జిపిఎస్ ను యెట్టి పరిస్థితుల్లో అమలు చేయకుండా పాత పెన్షన్ విధానాన్ని మాత్రమే కొనసాగించడానికి ఉత్తర్వులను యిచ్చి ఉద్యోగుల భవిష్యత్తుకు ఆసరా యివ్వాలని కలెక్టర్ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్జీఓ నాయకులు జివిఆర్ఎస్ కిషోర్, ఫ్యాప్టో చైర్మన్ వి. ధనుంజయ నాయుడు, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి. రమేష్, పిఆర్టియు జిల్లా అధ్యక్షులు జి. సాయి కిరణ్, నాయకులు ఎం. శేషగిరిరావు, ఎన్. బాలక్రిష్ణ, టి. సూర్యారావు, ఎం. శివున్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టిఎన్ ఎస్ ఎఫ్ ఆద్వర్యంలో నిరసన...

విశాలాంధ్ర-కురుపాం: కురుపాం నియోజకవర్గంలో మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ కు నిరసనగా తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ విభాగం ఆధ్వర్యంలో తెలుగు దేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ తోయక జగదీశ్వరి సమక్షంలో రిలే నిరాహారదీక్ష సోమవారంచేపట్టారు. మీడియా కో ఆర్డినేటర్ సుకేష్ చంద్ర పండా, రాష్ట్ర తెలుగుయువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్ , కురుపాం కన్వీనర్ కలిశెట్టి కొండయ్య, కన్నా , మాజీ సర్పంచ్ రామరాజు, కృష్ణబాబు , టిఎన్ ఎస్ ఎఫ్ ఉపాధ్యక్షులు పడాల శరత్,ముంజి హరీష్, కార్యనిర్వాహక కార్యదర్శి ఆచంటి విజయ్ కుమార్, కార్యదర్శిలు దేవాయని,భారతి, ప్రవీణ ఐటీడీపీ కురుపాం ఛాంపియన్ మీసాల ప్రశాంత్, కొమరాడ ఐటిడిపి ఛాంపియన్ మావుడి మురళి ఆనంద్, నాయకులు తదితరులు నాయకులు పాల్గొన్నారు.

కోనేరు పరిరక్షణకు చర్యలు తీసుకోండి : ఆమ్ఆద్మీ

విశాలాంధ్ర-విజయనగరం: ఎస్.కోట నుండి విశాఖ మార్గంలో సాయి బాబా గుడి ప్రక్కన గల కోనేరును బాగుచేసి, పరిరక్షించాలని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గం కన్వీనర్ పూసపాటి ప్రతాప్ వర్మ జేసీ మయూర్ అశోక్ ను కోరారు. ఈ మేరకు సోమవారం స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనేరులోకి చుట్టుపక్కల కాలువల నుండి మురికినీరు వచ్చి చేరుతుందని, ఆసుపత్రి వ్యర్థాలు సైతం కోనేరులోనే వేయడంతో కోనేరు చుట్టూ అపరిశుభ్ర వాతావరణం ఏర్పడిందని, కోనేరు నీరు కూడా కలుషితం అవుతుందని అన్నారు. దోమలు, దుర్వాసన తో పక్కనే వున్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, బీసీ హాస్టల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, వ్యాధుల కాలం కావడంతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కోనేరును బాగుచేసేలా చర్యలు తీసుకోవాలని, కోనేరు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన జేసీ తక్షణమే కోనేరును బాగుచేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తిప్పాన కోటేశ్వరరావు, కిలాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సిద్ది వినాయక ఉత్సవంలో పాల్గొన్న వైసీపీ యువజన విభాగం ఉపాధ్యక్షులు వంశీకృష్ణ

విశాలాంధ్ర-చీపురుపల్లి : శ్రీ సిద్ది వినాయక నవరాత్రి మహోత్సవంలో భాగంగా చీపురుపల్లి టౌన్ శ్రీ రామాంజనేయ కాలనీ, వంగపల్లి పేట లో జరిగిన అన్న సమారాధనలో విజయనగరం జిల్లా వైసీపి యువజన విభాగ ఉపాధ్యక్షులు బెల్లాన వంశీకృష్ణ చీపురుపల్లి మండల వైయస్సార్సీపి అధ్యక్షులు చీపురుపల్లి మేజర్ పంచాయతీ మంగళగిరి సుధారాణి శ్రీనివాస్, పట్టణ వార్డు మెంబర్లు ,గ్రామ పెద్దలు వైయస్సార్సీపి నాయకులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆర్మ్ రిజర్వు కానిస్టేబుల్‌కు రజితం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ఇటీవల శ్రీలంక దేశంలోని ఆగస్టు 19 నుండి 21 వరకు జరిగిన అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్-2023 క్రీడా పోటీల్లో విజయనగరం ఆర్మ్ రిజర్వు విభాగంలో కానిస్టేబులుగా పనిచేస్తున్న పి.సన్యాసి నాయుడు విశేష ప్రతిభ కనబర్చి రజతపతకం సాధించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించిన పి.సన్యాసి నాయుడున టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు సత్కరించి అభినందించారు.

సీపిఎస్, జీపీఎస్ విధానాలకు వ్యతిరేకంగా నిరసన

విశాలాంధ్ర-తెర్లాం: విజయనగరంలో ఏపీసీపీఎ ఈఏ & ఎఫ్ ఏపీటీఓ ఆధ్వర్యంలో సీపిఎస్, జీపీఎస్ విధానాలకు వ్యతిరేకంగా జరిగిన శాంతియుత నిరసన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో తెర్లాం మండల ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'స్పందన' ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం చేయాలి

ఎస్పీ ఎం.దీపిక

విశాలాంధ్ర-విజయనగరం: విజయనగరం జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఎస్పి దీపిక ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, చట్ట పరిధిలో న్యాయం చేయాలని అధికారులకు ఆదేశించారు. "స్పందన" కార్యక్రమంలో 40 ఫిర్యాదు లను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. డెంకాడ మండలం జొన్నాడకు చెందిన ఒక వ్యక్తి జిల్లా ఎస్పీగార్కి ఫిర్యాదు చేస్తూ తాను ఇంజనీరింగు చదువు తున్నట్లు, తన రూంలో ల్యాప్టాప్ పోయినట్లు, న్యాయం చేయాలని కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన జిల్లాఎస్పీ విచారణ చేపట్టి, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని డెంకాడ ఎస్ఐను ఆదేశించారు.అలాగే జామి మండలం కలగాడ గ్రామానికి చెందిన ఒకామె ఫిర్యాదు చేస్తూ తన గ్రామంలో గల వ్యవసాయ భూమిని ఆక్రమించుకోవాలనే దురుద్దేశ్యంతో అదే ప్రాంతానికి చెందిన కొంతమంది వ్యక్తులు తప్పుడు పత్రాలు సృష్టించి, తనను బెదిరింపులకు గురి చేస్తున్నారని, న్యాయం చేయాలని కోరారు. ఈ ఫిర్యాదుపైస్పందించిన జిల్లా ఎస్పీ విచారణ చేపట్టి, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని ఎస్.కోట సిఐను ఆదేశించారు.తూర్పు గోదావరి జిల్లాకి చెందిన ఒకామె ఫిర్యాదు చేస్తూ అనకాపల్లికి చెందిన ఒక వ్యక్తి తన ఫోటోలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తానని బెదిరిస్తూ, తనను డబ్బులు ఇవ్వాలని డిమాండు చేస్తున్నారని, న్యాయం చేయాలని కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన జిల్లా ఎస్పీ విచారణ చేపట్టి, చట్ట పరిధిలో చర్యలుచేపట్టి, ఫిర్యాదికి న్యాయం చేయాలని దిశ సిఐని ఆదేశించారు. విజయనగరం పట్టణంకు చెందిన ఒక వ్యక్తి ఫిర్యాదు చేస్తూ తాను ఒక ప్రైవేటు డిగ్రీ కళాశాలలో ఉద్యోగం చేస్తున్నట్లు, యాజమాన్యం నిబంధనలకు వ్యతిరేకంగా తక్కువగా జీతం ఇవ్వడంతో కోర్టునుఆశ్రయించగా, కోర్టు యాజమాన్యంను జీతం పెంచాలని ఆదేశించినప్పటికీ, అమలు చేయడం లేదని, న్యాయంచేయాలని కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన జిల్లా ఎస్పీ విచారణ చేపట్టి, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని విజయనగరం 1వ పట్టణ సిఐను ఆదేశించారు. విజయనగరం మండలం గొల్లలపేటకు చెందిన ఒక వ్యక్తి ఫిర్యాదు చేస్తూ తాను ఒక స్థలం కొనుగోలు నిమిత్తం సారిక గ్రామానికి చెందిన వ్యక్తికి రూ. 9.50 లక్షలు అడ్వాన్సుగా ఇచ్చినట్లు, ఎన్నటికి సదరుస్థలంను రిజిస్ట్రేషను చేయకపోవడంతో, తన డబ్బులను తిరిగి ఇవ్వాలని కోరగా, సదరు వ్యక్తి డబ్బుల్లో కొన్నిదొంగనోట్లును కలిపి తనకు ఇచ్చి, అగ్రిమెంటు తీసుకొని పోయినట్లు, న్యాయం చేయాలని కోరారు. ఈఫిర్యాదుపై స్పందించిన జిల్లా ఎస్పీ విచారణ చేపట్టి, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని విజయనగరం డిఎస్పీని ఆదేశించారు. భోగాపురంకు చెందిన మహిళ ఫిర్యాదులో తనకు 2022 లో శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన వ్యక్తితో వివాహం జరిగినట్లు, వివాహం అయినప్పటి నుండి భర్త , ఇతర బంధువులు తనను అదనంగా కట్నం తీసుకొని రమ్మనమని శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్లు, న్యాయం చేయాలని కోరారు.ఈ ఫిర్యాదుపై స్పందించిన జిల్లా ఎస్పీ విచారణ చేపట్టి, చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదికి న్యాయం చేయాలని దిశ సిఐను ఆదేశించారు. "స్పందన"లో స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి, 7 దినాల్లో ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను జిల్లా పోలీసు కార్యాలయానికి పంపాలని అధికారులను జిల్లా ఎస్పీ ఎం.దీపిక ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, డిసిఆర్బీ సిఐ జె. మురళి, ఎస్పీ సిఐలు కే.కే.వి.విజయనాథ్, ఈ. నర్సింహమూర్తి, డిసిఆర్బీ ఎస్ఐలు వాసుదేవ్, ప్రభావతి ,ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శరవేగంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

ప్రతిఒక్కరికీ వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని 16 సచివాలయాల పరిధిలో గల అన్ని గ్రామాలలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే శరవేగంగా జరుగుతోంది. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామ వాలంటీర్లు గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి వైద్యపరీక్షలు జరుపుతున్నారు. రోగులను గుర్తించి వారి పేర్లను రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. సర్వే మేరకు రోగులకు గల జబ్బులను నయం చేసేందుకు వీలుగా ఈనెల 30నుంచి రూపొందించిన కార్యాచరణను అమలు చేసేందుకు ప్రత్యేక వైద్యబృందాలతో ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు మండలంలోని బానాది గ్రామంలో ఎంఎల్ హెచ్ పిభార్గవి సారథ్యంలో ఏఎన్ ఎం సంతోషి,ఆశా కార్యకర్తలు కే సూరిదేముడు, వి లక్ష్మి, గ్రామ వాలంటీర్లు గుమ్మడి దుర్గ, దుడ్డు సుశీల తదితరులు ఇంటింటికి తిరిగి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను చేసారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ విజిటర్ కాసులమ్మ సర్వేను పర్యవేక్షించారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని, చిన్ననాటి నుంచే ఇష్టమైన క్రీడారంగంలో ప్రతి ఒక్కరూ రాణించాల్సిన అవసరం ఉందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు జి.ఈశ్వర్ కౌశిక్ అన్నారు. సోమవారం స్థానిక రాజీవ్ ఇండోర్ స్టేడియంలో అండర్-14, 17 విభాగంలో(బాలబాలికలు) జిల్లా స్థాయి కరాటే క్రీడాకారుల ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో ప్రావీణ్యం ఉన్న వారికి చదువుతోపాటు, ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. జిల్లా తరఫున ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించి మన ప్రాంతానికి పేరు, ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

13వ రోజు రిలే నిరాహారదీక్షలో మాజీ ఎమ్మెల్యే కోళ్ల, ఎస్.కోట నాయకులు

సంఘీభావం తెలిపిన సంచారజాతికి చెందిన గంగిరెడ్ల వారు, డూడూ బసవన్నలు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్, పార్టీ నేతలు, కార్యకర్తలపై పోలీసుల దాడులు, అక్రమ అరెస్టులకు నిరసనగా శృంగవరపుకోటలోని శ్రీ దారగంగమ్మ ఫంక్షన్ హాల్ ఆవరణలో నియోజకవర్గ ఇంఛార్జ్, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, టీడీపీ ఎస్.కోట నాయకులతో కలిసి సామూహిక రిలే నిరాహార దీక్షల్లో సోమవారం కూర్చున్నారు. చంద్రబాబు నాయుడుకి మద్దతుగా 13వ రోజు రిలే నిరాహారదీక్ష వద్దకు తిమిడి గ్రామ పంచాయితీలో నివాసం ఉంటున్న సంచారజాతికి చెందిన గంగిరెద్దులు, డూడూ బసవన్నలు, కొమ్మ దాసరులు కలిసి దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే లలితకుమారి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హయాంలో చంద్రబాబునాయుడు సంచార తెగలకు చెందిన వారందరికీ హిందూ సంస్కృతి, సంప్రదాయ గుర్తింపు తీసుకొనివచ్చారని, వారికి ఎన్నో సంక్షేమ పథకాల్ని ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సంచారజాతికి చెందిన గంగిరెద్దులు, డూడూ బసవన్నలు, కొమ్మ దాసరులను వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. అసలు ఇలాంటి జాతి ఒకటి ఉందని జగన్మోహన్ రెడ్డికి తెలుసా ? అని ప్రశ్నించారు. ఈ సామూహిక రిలే నిరాహార దీక్షలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, మాజీ వైస్ ఎంపీపీ నానిగిరి రమనాజీ, కొనదం మల్లేశ్వరరావు, జెడ్పిటీసీ అభ్యర్థి బీశెట్టి అరుణ, నాయకులు సీహెచ్.సుబ్బారావు, సత్తిరాజు, వసంత వెంకటరమణ, దోకుల చిన అచ్చిమనాయుడు, దోకుల శ్రీను, చక్కా కిరణ్ కుమార్, శృంగవరపుకోట నియోజకవర్గ పరిధిలో గల వివిధ హోదాల్లో ఉన్న అనుబంధ కమిటీ నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు. అనంతరం చంద్రబాబు నాయుడు ఆరోగ్యం బాగుండటంతో పాటు త్వరితగతిన కోర్టుల నుండి కడిగిన ముత్యంలా బయట పడాలని ఎస్.కోట నానిగిరి వీధిలో సిద్ది వినాయక విగ్రహం ఎదుట టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్ నాయుడు, వైస్ ఎంపీపీ నానిగిరి రమనాజీ సారథ్యంలో టీడీపీ నాయకులు కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు.

గ్రామాల్లో జోరందుకున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాలు

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని ఈనెల 30నుండి ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో బాగంగా ఇంటింటి సర్వే కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయని ఎంపిడిఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, తహశీల్దార్ ఎన్వీరమణ, సీతానగరం, పెదంకలం వైద్యులు శిరీష, ఉషారాణి,రాధాకాంత్ లు తెలిపారు.నిర్దేశించిన ఏఎన్ఎం యాప్లో మరణాలు, వలసలు వెళ్ళేవారిని తొలగించి మిగిలిన కుటుంబ సభ్యుల వివరాలపై సర్వేచేస్తున్నారనితెలిపారు. జేఏఎస్ ద్వారా 18 ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరికీ బిపి, షుగర్ పరీక్షలు తప్పనిసరిగా చేస్తారని, ఈపరీక్షలు వద్దని తిరస్కరించిన వారికి చేయరని తెలిపారు.సర్వేలో అవసరమయినవారికి యూరిన్ టెస్ట్,మలేరియా, డెంగ్యూ పరీక్షలు చేస్తారన్నారు.టెస్ట్ లు చేసేటప్పుడు వైద్య సిబ్బంది గ్లవ్, మరియు సానటైజర్ తప్పనిసరిగా వినియోగించాలన్నారు.టెస్టులు చేసిన తరువాత క్షుణ్ణంగా వివరాలను అప్ లోడ్ చేయడం జరుగుతుందన్నారు.గృహ సందర్శన చేసినప్పుడు వాలంటీర్ ఆరోగ్యశ్రీ బ్రోచర్ ను కుటుంబ సభ్యులకు ఇచ్చినది లేనిదీ సమాచారం సేకరించాలని, జగనన్న ఆరోగ్య సురక్ష కాన్సెప్ట్ మరియు క్యాంప్ మరియు సేవల వివరాలు కుటుంబ సభ్యులకు తెలియ చేసి ఆసర్వీసెస్ వినియోగించుకునేలా చూడాలన్నారు.జగనన్న సురక్ష క్యాంప్ లో ఇద్దరు వైద్యులు,మరియు ఇద్దరు. ప్రత్యేక వైద్యులు వుంటారని, రక్త పరీక్షలు చేస్తారని,అవసరమయితే రెఫరల్ వైద్య సేవలు అందచేస్తారన్నారు. ఇంటింటి సర్వేలో రోగులకు చేపట్టిన ఏడు రకాల టెస్టుల గూర్చి కుటుంబ సభ్యులకు తెలియజేయాలని తెలిపారు.ఆశాలచేత ఏటువంటి సర్వే చేయించకూడదని, ఏ ఎన్ ఎం లేదా సి హెచ్ ఓ లు మాత్రమే సర్వే చేయాలన్నారు. కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్,మిషన్ డైరెక్టర్, ఎన్ హెచ్ ఎం వారి ఆదేశాలు అనుసరించి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బీజేపీ మెడలు వంచి విశాఖ స్టీలుప్లాంటును రక్షించుకుందాం

– సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లోక్‌నాథం, ధనలక్ష్మి

విశాలాంధ్ర-శృంగవరపుకోట : కేంద్రంలోని బీజేపీ మెడలు వంచైనా విశాఖలోని స్టీల్ ప్లాంటును రక్షించుకుందామని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.లోక నాథం, ధనలక్ష్మి పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదాలతో ఉక్కు రక్షణ యాత్ర బైక్ ర్యాలీ శృంగవరపుకోట పట్టణానికి సోమవారం చేరుకుంది. ఉత్తరాంధ్రలో ఆరు జిల్లాల పర్యటనలో భాగంగా 10 రోజులలో 1050 కిలోమీటర్లు బైక్ యాత్ర కొనసాగుతున్న సందర్భంగా స్థానిక దేవి బొమ్మ కూడలిలో ఏర్పాటు చేసిన సభలో సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే.లోకనాథం, ధనలక్ష్మి, విజయనగరం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ నిర్మాణం చేపట్టాలని జరిగిన పోరాటంలో 32 మంది రైతన్నలు బలిదానం అయ్యారని గుర్తు చేశారు. వారు చేసిన బలిదానం ఫలితంగా నేడు లక్షలాదిమందికి విశాఖ ఉక్కు పరిశ్రమ ఉపాధి చూపుతోందన్నారు. స్టీల్ ప్లాంటు నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.4500 కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. నాటి నుంచి నేటి వరకు కేంద్ర ప్రభుత్వానికి స్టీల్ ప్లాంట్ పన్నులు, ఇతర డివిడెండ్ల రూపంలోనూ 45 వేల కోట్ల రూపాయలు చెల్లించిందని తెలిపారు. ఇటువంటి స్టీల్ పరిశ్రమకు సొంత గనులను, పరిశ్రమకు రావలసినటువంటి ముడి సరుకును రానివ్వకుండా బీజేపీ సారథ్యంలో మోడీ ప్రభుత్వం దుర్మార్గంగా అడ్డుకుంటోందని విమర్శించారు. లక్ష కోట్ల విలువైన ప్రభుత్వ పరిశ్రమను ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు అమ్మేయాలని విశ్వ ప్రయత్నాలు చేస్తుందని, ఇప్పటికే స్టీల్ ప్లాంట్లో కొంత భూమిని ఆదానీకి అమ్మ చూపిందన్నారు. మన రాష్ట్రంలో ఉన్న అధికారపక్షం వైసీపీ, ప్రతిపక్షంగా ఉన్న టిడిపి, జనసేన పార్టీలు మోడీ విధానాలను ఎక్కడా వ్యతిరేకించడంలేదన్నారు. ఇప్పటికే బీజేపీ ప్రభుత్వం అనేక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేసిందన్నారు. నింగి నేల అనే తేడా లేకుండా సర్వం కార్పొరేట్ వ్యక్తులకు అమ్మేస్తుందని, దీని వలన మన దేశ ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే కుంటు బడిందని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు వచ్చే పరిస్థితి ఉండదన్నారు. అమ్మటానికి వీడెవడు కొనటానికి వాడు ఎవడు.. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు, విశాఖ ఉక్కుకు ప్రభుత్వం గనులు కేటాయించాలని, వేలాది సంఖ్యలో స్టీల్‌ప్లాంట్లో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, అలాగే వచ్చే ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో స్టీల్‌ప్లాంట్ ను ప్రవేటిపరం కానివ్వం.. ప్రభుత్వంలోనే కొనసాగిస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ కోట నియోజకవర్గం పార్టీ సభ్యులు, సానుభూతిపరులు, ట్రేడ్ యూనియన్ నాయకులు, స్కీం వర్కర్లు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు పరిరక్షణే ధ్యేయం : సిపిఎం

గజపతినగరం: విశాఖ ఉక్కు పరిరక్షణ ధ్యేయంగా ప్రతి ఒక్కరు ఉద్యమ బాట పట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లోకనాదం పిలుపునిచ్చారు ఉక్కు పరిరక్షణలో భాగంగా చేపట్టిన మోటార్ సైకిల్ యాత్ర సోమవారం గజపతినగరం పట్టణం చేరుకుంది ఈ బైక్ ర్యాలీ బృందానికి పూలతో సిపిఎం నేతలు స్వాగతం పలికారు అనంతరం అంబేద్కర్ విగ్ర హానికి సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమాదేవి పూలదండ వేసి నివాళులర్పించారు అనంతరం నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద సభలో ఆమె మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మడానికి పూనుకొని దేశ సంపదను భవిష్యత్తును నాశనం చేస్తున్నారు అందులో భాగంగానే విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్ముతున్నారు ప్రతి పక్షంలో ఉన్న టిడిపి కూడా మోడీని వ్యతిరేకించడం లేదన్నారు అమ్మితే మనం నష్టపోవడానికి సిద్ధంగా లేమని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా పార్టీ కార్యదర్శి తమ్మినేని సూర్య నారాయణ జిల్లా కార్య దర్శి వర్గ సభ్యులు వీ లక్ష్మి జిల్లా కమిటీ సభ్యులు జి శ్రీనివాస్ రాకోటి రాములు దాసరి సింహాద్రి కనకరాజు కృష్ణ రాము హరికృష్ణ వేణి నూకరాజు మన్యం జిల్లా నాయకులు మన్మధరావు శ్రీకాకుళం జిల్లా నాయకులు తిరుపతిరావు విశాఖ స్టీల్ ప్లాంట్ యూనియన్ నాయకులు కేఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిరోధానికి కృషి చేయండి

స్వచ్ఛంద సంస్థలకు జడ్పీ చైర్మన్ పిలుపు

విశాలాంధ్ర-విజయనగరం : రోజురోజుకీ పెరుగుతున్న బాల్య వివాహాల నిరోధానికి స్వచ్ఛంద సంస్థలు క్రుషి చేయాలని విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.సోమవారం ఉదయం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ఆయన ఛాంబర్లో నీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర బాలల హక్కుల రక్షణ కమిషన్ చైర్మన్ డాక్టర్ కేసలి అప్పారావుతో కలిసి బాల్య వివాహాల నిరోధ ప్రచార గోడ పత్రికలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే వివాహం చేయడం వలన ఆరోగ్య పరంగానే కాక,ఆర్థికంగా కుటుంబాలు చితికి పోతున్నాయని,ఎంత అవగాహన కల్పిస్తూ కార్యక్రమాలు చేస్తున్నా పల్లెల్లో ఇంకా బాల్య వివాహాలు ప్రోత్సహిస్తున్నారని,స్వచ్ఛంద సంస్థలు పోలీసులు లైన్ డిపార్ట్మెంట్ల సహకారంతో వాటి నిరోధానికి పని చేయాలని పిలుపునిచ్చారు. యస్ఆర్పీసి ఛైర్మన్ కేసలి అప్పారావు మాట్లాడుతూ బాలల హక్కులకు భంగం కలగకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని, బాల్య వివాహాలు చట్ట విరుద్ధం కావున బాల్య వివాహాలు నిరోధానికి ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జిల్లా స్వచ్ఛంద సంస్థల సమైఖ్య అధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు ఆయనను శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో గుర్ల, గజపతినగరం,చీపురుపల్లి జెడ్పీటీసీ సభ్యులు శీర సన్యాసినాయుడు,గార తౌడు,వలిరెడ్డి శ్రీనివాసులు నాయుడు,నీడ్ డైరెక్టర్ పాచిపెంట వేణుగోపాలరావు, సిడబ్ల్యుసి మాజీ సభ్యుడు ప్రసాద్ పట్నాయక్,మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పద్మలత,ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జంగం జోషి,నీడ్ సిబ్బంది శివ,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హోదా కాదు...బాధ్యతగా భావిస్తున్నాం

రూ.52 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు

రూ.1000 కోట్లతో ఇంటింటికీ తాగునీరు

జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-విజయనగరం: పదవిని హోదాగా కాకుండా ఒక బాధ్యతగా భావిస్తున్నామని జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ముఖ్యమంత్రి తనకిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ, నిరంతరం ప్రజలకు సేవలందిస్తున్నామని చెప్పారు. జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా రెండేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా, సోమవారం జెడ్‌పి సమావేశ మందిరంలో సిఇఓ కె.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది అభినందనలు తెలిపారు. అనంతరం ఛైర్మన్ శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు. మంత్రి బొత్స సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, రెండు జిల్లాల కలెక్టర్లు, ఎంపి, ఎంఎల్‌సిలు, ఎంఎల్‌ఏల సంపూర్ణ సహకారంతో, అందరినీ సమన్వయ పరుచుకుంటూ, పారదర్శక పాలనను అందిస్తున్నామని చెప్పారు. కార్యకర్తలకు, సామాన్య ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వారితో మమేకం అవుతున్నామని అన్నారు. జెడ్పిలో ప్రతిపక్ష పార్టీలకు ప్రాతినిధ్యం లేనప్పటికీ, తమ పార్టీ సభ్యులే నిరంతరం ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూ, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న విషయం తనకు అత్యంత సంతృప్తిని ఇచ్చిందని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ నుంచి సుమారు రూ.51.74 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించినట్లు ఛైర్మన్ తెలిపారు. త్రాగునీరు, రహదారుల నిర్మాణానికి అత్యధికంగా నిధులను వెచ్చించినట్లు తెలిపారు. క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జెడ్‌పి ద్వారా కృషి చేశామన్నారు. ఉపాధిహామీ పథకం నిధులను సక్రమంగా, సకాలంలో వినియోగించుకొని, ప్రాధాన్యత, ప్రాధాన్యేతర పనులను త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేసినట్లు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులను సకాలంలో వినియోగించుకునేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రాధాన్యతలు, ఆదేశాలకు అనుగుణంగా శతశాతం నిధులను వెచ్చించినట్లు వివరించారు. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా ప్రతీఒక్కరికీ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలను అందిస్తున్నట్లు తెలిపారు. జలజీవన్ మిషన్ ద్వారా సుమారు రూ.వెయ్యి కోట్లతో ఉమ్మడి జిల్లాలో దశలవారీగా ఇంటింటికీ త్రాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని, దీనిలో భాగంగా ఇప్పటివరకు సుమారు రూ.వంద కోట్లు వరకు ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. అక్టోబరు నాటికి సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఇప్పటివరకు 46 మందికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలను కల్పించామన్నారు. జెడ్‌పి అధికారులు, సిబ్బంది సహకారం మరువలేనిదని, వారి సేవలను గుర్తించి 57 మందికి పదోన్నతులను అందించినట్లు తెలిపారు. అందరి సహకారంతో ఆదర్శవంతమైన జిల్లాపరిషత్ గా నిలబెట్టేందుకు తనవంతు కృషి చేస్తున్నట్లు ఛైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు. విలేకర్ల సమావేశంలో పలువురు జెడ్‌పిటిసి సభ్యులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

వివాదాస్పదంగా మారిన ప్రభుత్వ స్థలం

పోలీసులూ, గ్రామ పెద్దలూ సర్వేయర్‌కు ఫిర్యాదు

విశాలాంధ్ర-మెరకముడిదాం : మండలం బుధరాయివలస పోలీస్ స్టేషన్ క్వాటర్స్ కు ఎస్సీ కాలనీలో ఆనుకుని ఉన్న స్థలం పూర్వం రస్తాగా ఉండేది. కొద్ది సంవత్సరాల క్రితం పోలీసు వారు ఖాళీగా ఉన్న స్థలంలో కంచి వేయడం జరిగింది. ఇప్పుడు ఆ స్థలంలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం గ్రామ పెద్దలు ఆ స్థలాన్ని అడగడం జరిగింది. పోలీసు వారు ఆ స్థలం మాది అని చెప్పడం వలన, పోలీసు వారు గ్రామ పెద్దలు జిల్లా సర్వేర్ కు కంప్లైంట్ చేయడం వలన సోమవారం జిల్లా సర్వేర్ శ్రీనివాసరావు వచ్చి 97 సర్వే నెంబరు పోలీసువారిదని, 168 సర్వే నెంబరు గవర్నమెంట్ ల్యాండ్ కు సంబంధించినటువంటిదని జిల్లా సర్వే చెప్పడం జరిగింది. సుమారుగా 300 కుటుంబాలకు సి సి రోడ్డు అవసరమని జిల్లా సర్వేర్ కు గ్రామ పెద్దలు తెలియపరచడం జరిగింది. జిల్లా సర్వేరు శ్రీనివాస రావు పి. రికార్డులను పూర్తిగా పరిశీలించిన తర్వాత పూర్తి వివరణ ఇవ్వడం జరుగుతుందని. పోలీసు వారు కు గ్రామ పెద్దలకు తెలియ పరచడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు. మండల సర్వే శ్రీనివాసరావు, ఆర్ ఐ గౌరీనాయుడు ,చీపురుపల్లి సిఐ సంజీవరావు, బూర్లే నరేష్ కుమార్, సరిది రమేష్, సర్పంచ్ సారికి తమ్మి నాయుడు, ఎంపీటీసీ సరిది గంగయ్య లోకేష్, తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రోగులకు అందుబాటు లేని బొద్దాం పీహెచ్‌సీ

అత్యవసర వేళల్లో ఆస్పత్రికి వెళ్లలేకపోతున్న రోగులు

ఆస్పత్రిని ప్రధాన రహదారికి తరలించాలని రోగుల వేడుకోలు



విశాలాంధ్ర-వేపాడ : ప్రజలకు అత్యవసరమైన ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టినా పాలకులకు ముందు చూపుతో వ్యవహరించాలి అందుకు ప్రభుత్వ ఉన్నత అధికారుల చొరవ దూరదృష్టితో సహకరించాలి. అందుకోసం ఖర్చుచేసే ప్రజాధనం వృథా కాకుండా చూడాలి.చేసిన అభివృద్ధి ప్రజలకు ఉపయోగపడాలి. స్వార్ధబుద్ధితో ఏ అభివృద్ధి పనిచేసినా ఎటువంటి ప్రయోజనం చేకూరదని గ్రహించాలి. చేసేది మంచైనా చెడైనా ప్రజలు జీవితాంతం గుర్తు పెట్టుకుంటారన్నది పాలకులు గ్రహించాలి. ఇలాంటి సంఘటన మండలంలోని రెండవ ప్రాథమిక ఆరోగ్య కేంద్రమైన బొద్దాం గ్రామంలో చోటు చేసుకుంది. మండల కేంద్రం వేపాడతో పాటు బొద్దాం గ్రామంలో కూడా ప్రభుత్వం గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంజూరు చేయగా అప్పటి పాలకులు రెండు చోట్ల ఆస్పత్రి భవనాలను నిర్మించారు. అంతవరకు బాగానే ఉంది. వేపాడలో నిర్మించిన ఆస్పత్రి భవనం అందరికి అందుబాటులో ఉండగా బొద్దాం గ్రామంలో ప్రాథమిక పాఠశాలను ఆనుకొని నిర్మించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం రోగులకు అందుబాటులో లేకుండా పోయింది. ఈ ఆస్పత్రి పరిధిలో గల సోంపురం, పాటూరు, కొత్త బొద్దాం, ముకుందపురం, ఓబలయ్యపాలెం, రామస్వామిపేట, పెద క్రిష్ణ రాజపురం, కొండగంగుబూడి గ్రామాలతో పాటు ఎల్ కోట, ఎస్ కోట మండలాల్లోని మరి కొన్ని గ్రామాలకు చెందిన రోగులు ఇక్కడకు రావాలంటే బొద్దాం నాలుగు రోడ్ల కూడలిలో దిగి అక్కడ నుండి సుమారు కిలోమీటరుకి పైగా దూరంలో ఉన్న ఆస్పత్రికి నడుచుకుంటూ పోవాలి. దాంతో ఈ ఆస్పత్రిలో ఓపి రోగులు గాని, ఆస్పత్రిలో చేరే రోగులు గాని, చాలా తక్కువనే చెప్పాలి. ఆస్పత్రి మంజూరు చేయించిన పెద్దలకు దూరదృష్టి లేకో వారి అడ్డాలో ఆస్పత్రి ఉండాలన్న అహంకారమో తెలీదు గాని ఇక్కడ రోగులకు అందే సేవలు అరకొరగానే చెప్పాలి. అదే విశాఖ అరకు ప్రధాన రహదారిలో ఈ ఆస్పత్రి నిర్మించి ఉంటే అన్ని గ్రామాల ప్రజలతో పాటు రోడ్డు ప్రమాదాల వల్ల క్షతగాత్రులకు కూడా సకాలంలో వైద్యసేవలందించే అవకాశం కలిగివుండేది. ఇప్పటికైనా పాలకులు ప్రజలందరి సౌకర్యార్థం విశాఖ అరకు ప్రధాన రహదారికి ఆనుకొని రోగులకు అందుబాటులో ఉండే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తరలించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కాగా ప్రతి పిహెచ్‌సి కి ప్రభుత్వం 108,104అంబులెన్సు లను సమకూర్చిన సంగతి అందరికి తెలిసిందే. కానీ ఈ ఆస్పత్రిలో అంబులెన్సులు ఉంచేందుకు స్థలం, రోడ్డు సౌకర్యం సరిగా లేకపోవడంతో 104 అంబులెన్సు మాత్రమే మంజూరు చేసినా అదికూడా వేరే చోట ఉంచాల్సిన దుస్థితి నెలకొంది. నిజానికి 104కంటే 108 అంబులెన్సు అవసరమే ఎక్కువ. మరి ఇక్కడి పాలకులు ఎందుకు కానరాలేనట్లుగా వ్యవహరిస్తున్నారో అర్థం కాక అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకుంది.

ఘనంగా పండిట్ దీన్ దయాల్ జయంతి

విశాలాంధ్ర-చీపురుపల్లి : భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులలో ఒకరైన పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ వారి జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ చీపురుపల్లి నియోజకవర్గం చీపురుపల్లి మండలం రామలింగా పురం లో ఘన నివాళి అర్పించిన చీపురుపల్లి మండలం బీజేపీ అధ్యక్షులు, ఇప్పిలి నీలకంఠం బీజేపీ యువమోర్చ విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నెపూరి శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో కార్యకర్తలు నాయుకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పై పెట్టిన అక్రమ అరెస్టులు ఖండించండి

టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ బేబీనాయన

విశాలాంధ్ర-బొబ్బిలి: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని అక్రమంగా అరెస్ట్ చేసి రిమాండ్ విధించడం తో నిరసన తెలుపుతూ చేస్తున్నటువంటి రిలే నిరాహార దీక్షలో భాగంగా టిడిపి నియోజకవర్గం ఇంచార్జ్ బేబినాయన నాయకత్వంలో 13వ రోజు రిలే నిరాహార దీక్షలు చేరుకున్నాయి. సోమవారం మండలంలో గల గున్నతోటవలస, ఎం.బూర్జివలస, పనుకువలస, కొత్త పెంట గ్రామాల నుండి సుమారుగా 150 మంది తెలుగుదేశంపార్టీ నాయకులు కార్యకర్తలందరితో కలసి దీక్షను చేపట్టారు. ఈ దీక్షాశిబిరంలో గున్నతోటవలస సర్పంచ్ సింగనపల్లి.ఈశ్వరరావు ,కొత్తపెంట సర్పంచ్ చోడవరపు.సూర్యనారాయణ, ఎం బూర్జి వలస మాజీ తాలాడ సత్యం, గొర్లి లక్షణ, గొర్లి.కామేష్ ,చీకల గోపాల పాల్గొంటూ బాబుకి తోడుగా మేమున్నాం అనే కరపత్రాలను పంచి సంతకాల సేకరణ చేశారు. దీక్షా కార్యక్రమంలో వీరందరికీ మద్దతుగా నియోజకవర్గ ఇన్చార్జ్ బేబినాయన తో పాటుగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ.భాస్కరరావు ,బొబ్బిలి మండల పార్టీ అధ్యక్షుడు వాసిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: మండల కేంద్రం లో తెర్లాం మెయిన్ సెంటర్ వద్ద రచ్చబండ సమీపం లో టిడిపి పార్టీ ఉత్తరాంధ్ర ఇంచార్జి బెబినాయన, మాజీ శాసనసభ్యులు తెంటు లక్ష్మున్నాయిడు తన కార్యకర్తలతో కలిసి ఒక్కరోజు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ దీక్ష లో బాబు కు మేము ఉన్నాం అంటూ సంతకాల సేకరణలు చేపట్టి వచ్చిన కార్యకర్తలకు కండువాలు, పూలమాలలు వేసి దీక్ష శిభిరం లో కూర్చుని ప్రభుత్వం పై విమర్శలు చేశారు. దీక్షలో పార్టీ ముఖ్యనేతలతో పాటు తెర్లాం మండల నాయకులు నర్సుపల్లి వెంకట నాయుడు, నర్సుపల్లి వెంకటేశ్వరరావు, బెడెల సించలం, టిడిపి నగరాల సాదకారత సమితి అధ్యక్షులు కొరగంజి సాయిరాం, మఠ్రాపు యుగంధర్, మఠ్రాపు శంకర్రావు, ఆమిటి రమేష్,వీరితో పాటు వివిధ గ్రామాల నుంచి టిడిపి కార్యకర్తలు ఈ ఒక్క రోజు రిలే నిరాహారదీక్ష లో పాల్గొన్నారు.

కక్ష సాధింపు పాలన ఎంతో కాలం సాగదు

మెంటాడ: కక్ష సాధింపు పాలనతో చిరకాలం పరిపాలించుకోవచ్చు అనుకోవడం మూర్ఖత్వమని అటువంటివారు చరిత్ర పుటల్లో నిలవలేక పోయారని జగన్ అటువంటి వాడినేనీ మండల టిడిపి అధ్యక్షులు చలుమూరి వెంకట్రావు ఎద్దేవ్ చేశారు. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు కు గుర్ల తమ్మిరాజు పేట గ్రామ ప్రజలు సోమవారం సంఘీభావ నిరసన కార్యక్రమం నిర్వహించారు. తమ్మి రాజుపేట తమ్మి రాజుపేట గ్రామానికి చెందిన మహిళలు యువతి యువకులు పార్టీ కార్యకర్తలు బాబుతో మేము అనే నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో మాజీ వైస్ సర్పంచ్ చొక్కాకు సన్యాసి నాయుడు, తిరపతి, కోరిపల్లి రాజు, గొర్లి సూర్యనారాయణ, గొర్లేఅప్పల నాయుడు పైల రాము, గ్రామ యువత మహిళలు పాల్గొన్నారు.

నాయి బ్రాహ్మణుల సంఘీభావం

గజపతినగరం: తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా సోమవారం రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి కరణం శివరామకృష్ణ ఆధ్వర్యంలో తన పార్టీ కార్యాలయం ఆవరణలో రిలే నిరాహార దీక్షలో భాగంగా నాయి బ్రాహ్మణులు భాజా భజంత్రీలు తో సంఘీభావం తెలిపి నినాదాలు చేశారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు మిత్తిరెడ్డి ఈశ్వరరావు లంక సత్యనారాయణ కొరుపోలు రమేష్ లంక చిన్నమనాయుడు అరుణ కర్రీ సత్యనారాయణ కర్రీ ఆదినారాయణ పిన్నింటి లక్ష్మునాయుడు బోని గోవింద మజ్జి గోవింద పాల్గొన్నారు.

బాబును అన్యాయంగా ఇరికించారు

రామభద్రపురం : మాజీ ముఖ్యమంత్రి ప్రస్తుత ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబు నాయుడు ను వైకాప ప్రభుత్వం అన్యాయంగా ఇరికించిందని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహణ కర్యదర్శి చింతల రామకృష్ణ ఆరోపించారు. సోమవారము గాంధీ బొమ్మ కూడలిలో ఉన్న ఆంజనేయస్వామి టెంపుల్ లో వినాయక స్వామికి బాబుకు త్వరగా బెయిల్ మంజూరు అవ్వాలని రామకృష్ణ అనుచరులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. బాబును ఎన్ని హింసలు పెట్టినా, ఎన్ని రోజులు జైల్లో ఉంచిన వైఎస్ఆర్ ప్రభుత్వానికె నష్టం కలుగుతుందే తప్ప తెలుగుదేశం పార్టీకి రోజురోజుకీ ప్రజలలో ఆదరణ పెరుగుతుందన్నారు. ప్రపంచం మొత్తం జగన్మోహన్ రెడ్డిని అసహ్యించుకుంటున్నారని అన్నారు. చంద్రబాబు నాయుడు ను విడుదల చేయక పోతే రాష్ట్రం మొత్తం టీడీపీ సానుభూతిపరులంతా రాజమండ్రి సెంట్రల్ జైలుకు చేరుకొని చంద్రబాబుకు మద్దతుగా ఉంటారన్నారు. అలాగే ఈనెల 27వ తేదీన బుధవారం మండల పార్టీ కార్యాలయం ఎదురుగా చంద్రబాబు అరెస్టుకు నిరసనగా రిలే నిరాహార దీక్షలో చేపట్టడం జరుగుతుందని కావున అన్ని గ్రామాల నుంచి తెలుగుదేశం పార్టీ సర్పంచులు ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కనిమెరక వెంకటి, రామభద్రపురం సర్పంచ్ రవ్వ ఈశ్వరరావు, టిడిపి నాయకులు పూడి రామనాయుడు, మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు విజయభాస్కర్ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధిబెవర చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

కళ్ళకు గంతలు కట్టుకొని గొంప కృష్ణ రిలే దీక్ష

విశాలాంధ్ర-శృంగవరపుకోట: నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు కు నిరసనగా ఎస్.కోటలోని ఆకుల డిపో వద్ద టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ ఆధ్వర్యంలో కొత్త వలస మండల నాయకులు రిలే నిరాహార దీక్షలో సోమవారం కూర్చు న్నారు. ఈ సందర్భంగా గొంప క్రిష్ణ మాట్లాడుతూ చంద్రబాబు నాయు డుపై అక్రమ కేసులు పెట్టి రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హింసిస్తున్నారని దేశంలోని పలు పార్టీల ముఖ్యమంత్రులు, నాయకులు విశ్వసిస్తున్నారని గుర్తు చేశారు. అలాగే పలు ఆలయాల్లో పూజలు కూడా చేశామన్నారు. రాష్ట్రాభివృద్ధికి పాటు పడిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకి ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ప్రజలు తెలుగుదేశం పార్టీకి మద్దతు తెలిపి పట్టం కడతారని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో గొరపల్లి రాము, బాలకృష్ణ జగ్గారావు, వల్లపు ఈశ్వరరావు, కర్రీ సూర్య నూకరాజు, గుమ్మడి కోటి, బిశెట్టి ప్రసాద్, చిపాటు వేణు, బుసాల సూర్యనారాయణ, నాగబిల్లి చెల్లయ్య, పల్లి అప్పల సత్యనారాయణ, గోపిశెట్టి శ్రీను, కింతాడ రాము, చిన్నీ, సతీష్, చంటి, రమణ, గాడి అంజిబాబు, పెంటరావు, నాగు దొడ్డి ఈశ్వరరావు, మొల్లేటి ప్రకాష్, గుమ్మడి మహేష్, జగ్గారావు, ఎర్ర గోవింద, వెంకట్రావు, ఈశ్వరరావు, దాడి శ్రీను, సుంకరపాలెం సూర్యనారాయణ, నాగిశెట్టి రమణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంవీజీఆర్ లో ఇండియన్ కోస్ట్ గార్డ్‌లో ఇంజనీరింగ్ కెరీర్ అవకాశాలు పైన అవగాహన సదస్సు



విశాలాంధ్ర-డెంకాడ: ట్రెనింగ్ & ప్లేస్‌మెంట్ సెల్, ఎం.వీ.జీ.ఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, మెకానికల్, ఈ.ఈ.ఈ, ఐ.టి, ఈ.సీ.ఈ మరియు కంప్యూటర్ సైన్స్ విద్యార్థులందరికీ ఇండియన్ కోస్ట్ గార్డ్‌లో ఇంజనీరింగ్ కెరీర్ అవకాశాలు అనే అంశంపై ప్రత్యేక ప్రసంగాన్ని నిర్వహించింది. ఈ సెషన్‌కు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ వినోద్ కుమార్ పర్మార్, కోస్ట్ గార్డ్ రిఫిట్ %డ% ప్రొడక్షన్ సూపరింటెండెంట్, విశాఖపట్నం మరియు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎం.కె పధి, తత్రక్షక్ మెడల్, చీఫ్ స్టాఫ్ ఆఫీసర్ (టెక్నికల్), తూర్పు సముద్ర తీరం, విశాఖపట్నం అతిథులుగా హాజరయ్యారు. ఎం.కె పధి, ఇండియన్ కోస్ట్ గార్డ్ చరిత్ర, దాని విధులు, ఫంక్షన్స్, రిక్రూట్‌మెంట్ ప్రక్రియ మరియు ప్రయోజనాలపై విద్యార్థులందరికీ వివరణాత్మక ఉపన్యాసం ఇచ్చారు. వినోద్ కుమార్ పర్మార్ ఇండియన్ కోస్ట్ గార్డ్‌లో సాంకేతిక అధికారుల పాత్రలు మరియు బాధ్యతలను చర్చించారు మరియు విద్యార్థులు భవిష్యత్తు బిల్డింగ్ బ్లాక్‌లు అని దేశ భవిష్యత్తును నిర్మించడంలో విద్యార్థుల పాత్ర ఎక్కువని వాళ్ళని ఉద్దేశిస్తూ మాట్లాడి ప్రోత్సహించారు. ఈ సెషన్‌కు, ప్రొఫెసర్ ఆర్.రమేష్, ప్రిన్సిపల్-ఎం.వి.జి.ఆర్, డా. వై ఎం సి శేఖర్, వైస్ ప్రిన్సిపాల్-ఎం.వి.జి.ఆర్, డా. ఎం.సునీల్ ప్రకాష్, టీ%డ%పీ డీన్, ఎన్.మోహన్ కుమార్, డీన్-విద్యార్థులు, డా. ఎం.వీ.వీ భాను, టీపీఓ-ఎం.వీ.జీ.ఆర్, అన్ని డిపార్ట్‌మెంట్ టి&పి కోఆర్డినేటర్లు మరియు విద్యార్థులు హాజరయ్యారు.

లొడ్డ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలి : స్పందనలో వినతి



విశాలాంధ్ర-బెలగాం : కొమరాడ మండలం నయా పంచాయతీ లొడ్డ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ గిరిజన సంఘం నాయకులు దుక్క సీతారాం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో కలెక్టర్ కు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మా గ్రామం ఏజెన్సీ ప్రాంతమని మేమంతా నిరుపేద నిరక్షరాస్యులం గిరిజనులమని, మా గ్రామం చినఖేర్జిల పంచాయతీ సర్వపాడు గ్రామం నుంచి కొండపైకి మూడు కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. మా గ్రామానికి రహదారి సౌకర్యం లేక ప్రజలు నిత్యవసర వస్తువులు తెచ్చుకోవడానికి అనారోగ్యానికి గురైతే వైద్యానికి 108 వాహనం రావడానికి గాని, పిల్లలను చదువులకు గాని పంపేందుకు రహదారి సౌకర్యం లేక మా గ్రామ ప్రజలంతా అనేకమైన ఇబ్బందులకు గురవుతున్నమన్నారు. దీనివలన మేమంతా వెనుకబడి పోతున్నామని నేటికీ ఎవరికీ ఈ విషయం చెప్పుకోవాలో మాకు కూడా తెలియలేదన్నారు. కావున కలెక్టర్ మా యందు దయ ఉంచి మా దీన పరిస్థితి గ్రహించి సర్వపాడు గ్రామం నుంచి లొడ్డ గ్రామం వరకు మూడు కిలోమీటర్ల రోడ్డును శాంక్షన్ చేయించి మాకు న్యాయం జరిపించవలసిందిగా కోరుతున్నామని అన్నారు. కార్యక్రమంలో లొడ్డ గ్రామ ప్రజలు సుబ్బారావు, టి. మజ్జి రాముడు, వి. రామయ్య, టి .వాసు, యు. బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-దత్తిరాజేరు :మరడాం పంచాయతీ మర్రివలస గ్రామంలో సోమవారం సర్పంచ్ రామలక్ష్మి కొబ్బరికాయ కొట్టి సీసీ రోడ్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ ఇంజనీరింగ్ డిపార్మెంట్ నిధులతో సుమారుగా 70 లక్షలుతో ఎన్ ఎచ్ 26 రోడ్ నుండి మర్రివలస బరియల్ గ్రౌండ్ వరకు సీసీ రోడ్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలియజేసారు. మరడాం పంచాయతీ లో ఉన్న అన్ని గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాను అని అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొన్న లక్ష్మి, వైసీపీ నాయకులు శంకర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల ధరలు పారదర్శకంగా ఉండాలి : ఎడిఎ నిర్మల జ్యోతి



విశాలాంధ్ర-కురుపాం: ప్రైవేటు ఎరువుల దుకానాల లో ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే పారదర్శకంగా అమ్మకాలు చేపట్టాలని గుమ్మలక్ష్మీపురం ఎడిఎ ఎ.నిర్మలా జ్యోతి ఆదేశించారు. సోమవారం. గిజబ లక్ష్మి ఏజెన్సీలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులు కు ఎరువులు నిల్వలు సరిచూసారు. రికార్డుల నిర్వహణ పరిశీలించారు. ఎరువుల యొక్క రేట్లు ను రైతులకు ఏ రేట్లకు ఇస్తున్నారు అనేది ఆరా తీసారు.

ఈత పోటీల్లో నారాయణ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : పట్టణంలో రింగురోడ్డు వద్ద ఉన్న నారాయణ పాఠశాల, పైడితల్లి భవన్ లో చదువుతున్న జమ్మ జష్మిత-కు జిల్లా స్థాయి ఈతల పోటీలలో ప్రథమ బహుమతి, జమ్మూ యువ తేజేష్ కు ద్వితీయ, తృతీయ బహుమతులను అందుకున్నారు. ఇందుకు గాను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం ప్రభావతీదేవి వీరిని అభినందించారు తల్లిదండ్రులు జమ్ము శ్రీనివాసరావు, ఉమ యొక్క ప్రోత్సాహం ఎంతైనా ఉందన్నారు. నారాయణ పాఠశాల విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో కూడా సాధించడం అభినందనీయమన్నారు. రానున్నకాలంలో మరెన్నో విజయాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చే ప్రతి ఒక్కరూ ప్రయత్నం చేయాలన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

విశాలాంధ్ర-నెల్లిమర్ల: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పకడ్బందీగా నిర్వహించాలని కమిషనర్ పి బాలాజీ కోరారు. నెల్లిమర్ల నగరపంచాయతీ సచివాలయం-2 పరిధిలో సోమవారం నిర్వహి స్తున్న సర్వేని కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను శతశాతం పూర్తి చేయాలని కోరారు. ఆరోగ్య సురక్షపై అందరికీ అవగాహన కల్పించి శిబిరాలకు హాజరయ్యేవిధంగా చూడాలని సూచించారు.

అసెంబ్లీలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ రఘురాజు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఆంధ్రప్రదేశ్ శాసనసభ, శాసన మండలి వర్షాకాల సమావేశాల్లో భాగంగా 3వ రోజైన సోమవారం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డిని అసెంబ్లీలో మర్యాద పూర్వకముగా కలిసినట్టు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు స్థానిక విలేకరులతో ఫోన్లో మాట్లాడుతూ తెలిపారు. నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలు తదితర విషయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని ఎమ్మెల్సీ రఘురాజు వివరించారు..

ఆర్.ఎస్.పేట మాజీ సర్పంచ్ గొలగాని కృష్ణ భార్య మృతి

పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కోళ్ల

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని రామస్వామిపేట గ్రామ మాజీ సర్పంచ్ గొలగాని కృష్ణమూర్తి భార్య చంద్రమ్మ(65)సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల రాంప్రసాద్, మండల పార్టీ కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి తదితరులు రామస్వామిపేట చేరుకొని కృష్ణమూర్తిని పరామర్శించి ఓదార్చారు. మృత దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

పారిశుధ్య మెరుగుకు మరింత కృషి చేయాలి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : నగరంలో పారిశుధ్యం మెరుగుదలకు మరింత కృషి చేయాలని సచివాలయ కార్యదర్శిలకు, మేస్త్రీలకు నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారి డా.కొండపల్లి సాంబమూర్తి ఆదేశించారు. ఈ మేరకు సోమవారం 2, 3, 4, 5 సచివాలయాల పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. చేపడుతున్న పారిశుధ్య విధానాన్ని గమనించారు. ఇంటింటి చెత్త సేకరణ పై ఆరా తీశారు. తడి,పొడి చెత్త వర్గీకరించే విధానంపై ప్రజల్లో ఎంతమేర అవగాహన ఉందో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న పరిస్థితుల్లో వీధులలో చెత్తాచెదారాలు పేరుకుపోకుండా, కాలువల్లో పూడికలను ఎప్పటికప్పుడు తొలగించే విధంగా చొరవ చూపాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించామన్నారు. వ్యాధులు ప్రబలకుండా, దోమల వృద్ధిని అరికట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. డి ఎం ఓ విధానం ద్వారా ట్రేడ్ లైసెన్స్ ల రుసుములను శతశాతం వసూలు చేసే విధంగా సిబ్బందికి సూచించామన్నారు. అలాగే చెత్త పన్ను వసూలు ముమ్మరం కావాలని ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధే మా లక్ష్యం ...

పిఏసిఎస్ చైర్ పర్సన్ తాడ్డి

ఆరునెలలలో కోటి 33లక్షల రుణాలు

విశాలాంధ్ర-మెంటాడ: మెంటాడ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అభివృద్దే లక్ష్యంగా చేసుకుని ముందడుగు వేస్తున్నామని పిఏసిఎస్ చైర్ పర్సన్ తాడ్డి రామచంద్రరావు పేర్కొన్నారు.సోమవారం మెంటాడ పిఏసిఎస్ భవనంలో చైర్ పర్సన్ రామచంద్రరావు అధ్యక్షతన సాదారణ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు మార్ట్ గేజ్ (తనఖా)రుణాలు కోటి 33లక్షలు రైతులకు అందజేయడం జరిగిందని ఆయన అన్నారు.రుణాలరెన్యువల్ రూపంలో 60లక్షలు వసూలు చేయడం జరిగింది. ఎరువులు, పురుగుల మందుల అమ్మకాలు చేపట్టాలని సభ్యులు కోరారు.రైతులకు ఎల్లవేళలా సొసైటీ సిబ్బంది అందుబాటులో వుండడం వల్ల రైతులకు అనువుగా వుంటుందని సభ్యులు అభిప్రాయంను ఆయన వద్ద మొరపెట్టుకున్నారు. అలాగే దీర్ఘ కాలిక,స్వల్ప కాలిక రుణ సదుపా యాలు, ఉద్యోగులకు కూడా రుణాలను మంజూ రు చేయాలని డిమాండ్ చే శా రు. షా పిం గ్ కాంప్లెక్స్ సొసైటీ పరిసరాలలో ఏర్పాటుకు 15లక్షలు నాబార్డ్ నిధులు మంజూరు చేయడం జరిగిందని, స్థలసేకరణ రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తి అయితే తప్ప స్థలాన్ని నిర్ధారణ జరుగుతుందని గ్రామ సర్పంచ్ రేగిడి రాంబాబు సభ్యులకు తెలిపారు. ఎరువుల విషయంలో జిల్లా అధికారులు సొసైటీ లకు ప్రాధాన్యత ఇవ్వడంలేదని రామచంద్రరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రేగిడి రాంబాబు, సొసైటీ సిఇవో వెంపడాపు ప్రసాదరావు,త్రీమెన్ కమిటీ సభ్యులు దంతులూరి వెంకట చిట్టి రాజు,అల్లు తిరుపతి, సిబ్బంది పతివాడ విశ్వేశ్వర రావు, పాండ్రంకి చిరంజీవి, విశ్రాంత ఉపాధ్యాయులు మండల తిరుపతిరావు,ముగడ లింగేశ్వర రావు, విశ్రాంత సిఇఓ నీలాతి అప్పలనాయుడు, పలువురు రైతులు,సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జాతర మహోత్సవ సమయానికల్లా అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

ఇంజనీరింగ్ అధికారులకు కమిషనర్ శ్రీరాముల నాయుడు ఆదేశం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : నగర ప్రధాన వీధుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పైడితల్లమ్మ జాతర మహోత్సవ సమయానికల్లా పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులకు కమిషనర్ ఆర్ శ్రీరాముల నాయుడు ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ట్యాంక్ బండ్ రోడ్ లో ఉన్న ఆచంటా గార్డెన్ ప్రాంతాన్ని, ఎత్తు బ్రిడ్జి వద్ద నిర్మిస్తున్న బస్సు షెల్టర్ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులు ఎంత మేరకు వచ్చాయో అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు చేపట్టిన పనుల ప్రగతిని సమీక్షించారు. అంబేద్కర్ జంక్షన్ నుంచి తిరుమల నర్సింగ్ హోం వరకు ఉన్న ఆచంటా గార్డెను అందంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో కోటి 50 లక్షలు రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కౌన్సిల్ ఆమోదించింది. దీంతో దశలవారీగా చెరువు అభివృద్ధి పనులను చేపడుతున్నారు. ఇందులో భాగంగా మట్టితో చదును చేసే ప్రక్రియను పూర్తి చేశారు. ఆ ప్రాంతంలో ఫౌంటెన్లు ను కూడా ఏర్పాటు చేస్తు న్నారు. తదుపరి ఆకర్షణీయంగా తీర్చిదిద్దే విధంగా అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్ ఆర్ శ్రీరాములు నాయుడు త్వరితగతిన పనులు పూర్తయి విధంగా చొరవ చూపాలని అధికా రులకు, కాంట్రాక్టర్లకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి సూచనలు, సలహాలతో ఇప్పటికే ప్రధాన జంక్షన్లను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. అలాగే ట్యాంక్ బండ్ రోడ్డును ఆర్ అండ్ బి అధికారులు విస్తరించే పనులు చేపడుతున్నారన్నారు. ట్యాంక్ బండ్ రోడ్డుకు ఆనుకొని ఉన్న ఆచంటా గార్డెన్ ను అభివృద్ధి చేసేందుకు నిర్ణయించి తదనగుణంగా పనులను చేపట్టామన్నారు. అభివృద్ధి పనులు సత్వరమే పూర్తి చేసి పైడితల్లి అమ్మవారి జాతర సమయానికల్లా ప్రజావిని యోగంలోకి తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఈఈ శ్రీనివాసరావు, డీఈలు, కాంట్రాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్సీపీ ప్రభుత్వ విధానాలతో కోలుకున్న రైతులు

- ప్రభుత్వ విధానాలతో వలసలు నివారణ

- అసెంబ్లీలో ఎమ్మెల్యే కడుబండి

విశాలాంధ్ర-శృంగవరపుకోట: రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాలుగేళ్ళ నాలుగు నెలల పాలనలో అమలు చేస్తున్న మెరుగైన విధానాలతో రైతులకు ఎంతో మేలు కలిగిందని, ఉత్తరాంధ్ర జిల్లాల నుండి వలసలు బాగా తగ్గాయని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక విలేకరులతో ఎమ్మెల్యే ఫోన్లో మాట్లాడుతూ మా ప్రభుత్వ పాలనలో ఎస్.కోట నియోజకవర్గంలో ఉన్న 41వేల రైతు కుటుంబాలకు అందిన సహాయం వెలకట్టలేనిదని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం రాకముందు గ్రామాల్లో వ్యవసాయం చేస్తున్న రైతులు నష్టాలతో అప్పుల పాలైన పరిస్థితి ఉండేదని తెలిపారు. నియోజకవర్గంలో గడప గడపకు కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే నేరుగా కలిసిన 70వేల ఇళ్లలో 50వేల కుటుంబాలు వ్యవసాయం మీద ఆధారపడినవేనని, వారిని కలిసిన సందర్భంలో ప్రభుత్వం చేస్తున్న అనేక సహాయాల వల్ల వ్యవసాయం చేస్తున్నా నిలదొక్కుకో గలిగామని చెబుతున్నారని, ఇది ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలేనని స్పష్టం చేశారు. ఇక రైతులు, పేదరికంలో ఉన్న కుటుం బాలు ఈరోజు చేస్తున్న అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్మెంట్, ఆరోగ్య శ్రీ వంటి పథకాలతో పిల్లల్ని బాగా చదివించుకో గలుగుతున్నారని, కార్పొరేట్ వైద్యం అందుకుంటున్నారని సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. 2019 నాటికి నియోజకవర్గంలో 27వేల మెట్రిక్ టన్నుల వరి ప్రొక్యూర్మెంట్ జరిగేదని, 2023లో 47వేల మెట్రిక్ టన్నుల వరి ప్రొక్యూర్మెంట్ జరిగి రైతులకు సక్రమంగా నగదు అందించే వెసులుబాటు ఈ ప్రభుత్వం కల్పించిందన్నారు. గత టీడీపీ హయాంలో ప్రజలు, రైతులు అష్టకష్టాలు పడేవారని, పథకాలు అందని ద్రాక్షగా ఉండేవని గుర్తు చేశారు. ఇప్పటి ప్రభుత్వం అర్హులందరికీ పథకాలను సక్రమంగా అమలు చేస్తుండటంతో అందరూ బ్రతికి బట్ట కట్టుకో గలుగుతున్నామని నియోజకవర్గ పరిధిలోని రైతులు, ప్రజలు వ్యాఖ్యానిస్తు న్నారని, సీఎం జగన్మోహన్ రెడ్డి మేలు మరిచిపోలేమని చెబుతున్నారనే విషయాన్ని అసెంబ్లీలో వివరించినట్లు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు వివరించారు.

199 గిరిజనుల శిథిల ఇళ్లను పునఃనిర్మిస్తాం

హౌసింగ్ మంత్రి జోగి రమేష్ హామీ ఇచ్చారన్న ఎమ్మెల్సీ రఘురాజు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో మూడవ పనిదినమైన సోమవారం ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు శాసనమండలిలో గృహనిర్మాణ శాఖకు సంబంధించి జరిగిన ప్రశ్నోత్తరాలలో పాల్గొన్న విషయంపై స్థానిక విలేకరులతో ఫోన్లో మాట్లాడుతూ, గతంలో 1993-94 నుండి 2006-07 సంవత్సరం వరకు గల ఇళ్ళ మంజూరు పథకంలో (ఎస్పీఆర్ హౌసింగ్ ప్రోగ్రాం) భాగముగా ఉమ్మడి విజయనగరం జిల్లాలో గల 199 మంది పేద గిరిజనులకు మంజూరై నిర్మించబడిన సెమీ శాశ్వత గృహములు కూలిపోయే స్థితిలో ఉన్నందున ప్రస్తుతం "వై.ఎస్.ఆర్.పేదలందరికీ ఇళ్ళు" పథకంలో భాగముగా వారికి పక్కా ఇళ్ళు మంజూరుకు గల సాంకేతిక సమస్యలు తొలగించి మరియు జీఓ ఆర్టి. నెంబర్.88లో ఇచ్చిన వెసులుబాటును ఉపయోగించుకుని, 199 మంది పేద గిరిజనుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వమునకు ఇదివరకే సంబంధిత శాఖ ద్వారా సమర్పించబడిన ప్రతిపాదనల ఆమోదమునకు తీసుకుంటున్న చర్యల వివరములు తెలుపగలరని మండలి చైర్మన్ ద్వారా గృహనిర్మాణ శాఖ మంత్రిని ఎమ్మెల్సీ కోరారు. ఇందుకు స్పందించిన గృహనిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్, సభ్యులు ఇందుకూరి రఘురాజు సభదృష్టికి తీసుకువచ్చిన 199 మంది పేద గిరిజనులకు సంబంధించిన గృహ సమస్యను తప్పనిసరిగా పరిశీలనలోనికి తీసుకుంటామని హామీ ఇచ్చారనే విషయాన్ని ఎమ్మెల్సీ రఘురాజు పేర్కొన్నారు.

జీ.పి.యస్ తిరస్కరిస్తున్నాం, పాత పెన్షన్ సాధన దిశగా ఉద్యమిస్తాం : ఫ్యాప్టో

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిపిఎస్ తిరస్కరించి పాత పెన్షన్ సాధన దిశగా ఉద్యమిస్తామని సోమవారం రాష్ట్ర ఫ్యాప్టో, ఏపిసిపి ఎస్ఇఏ ఉమ్మడి పిలుపుమేరకు 'చలో కలెక్టరేట్" కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు అధిక సంఖ్యలో ఉపాధ్యాయ ఉద్యోగులు చేరుకోవడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్ రమేష్ చంద్ర పట్నాయక్, సెక్రెటరీ జనరల్ డి.ఈశ్వరరావు, ఏపీ సి.పి.యెస్.ఈ.ఏ రాష్ట్ర నాయకులు గంటా.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా రమేష్ చంద్ర పట్నాయక్ మాట్లాడుతూ జిపిఎస్ అనే మోసపూరిత పెన్షన్ విధానాన్ని వెనక్కి తీసుకోకపోతే, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో కలిసి ఆందోళన మరింత ఉధృతం చేస్తామని అన్నారు. డి ఈశ్వరరావు గారు మాట్లాడుతూ లోపభూరితమైన జి.పి.ఎస్ విధానాన్ని వెనక్కి తీసుకోకపోతే ఉద్యోగులు క్షమించరని అన్నారు. జిల్లా ఏపిసిపిఎస్ ఈ ఏ జిల్లా అధ్యక్షుడు రాజబత్తుల శివ కుమార్ మాట్లాడుతూ జిపిఎస్ పేరు తో మోసం చేస్తే ఓట్ ఫర్ ఓ పి ఎస్ తో తిప్పి కొడతామన్నారు..ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశంలో జిపిఎస్ విధానం బలవంతం గా అమలు చేయాలనీ చూస్తున్న ఈ ప్రభుత్వానికి సిపిఎస్ రద్దు చేయకపోవటాని రహస్య అజెండా ప్రజల ముందుకు వచ్చి చెప్పగలరా అని ప్రశ్నించారు. సిపిఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి మేనిఫెస్టో లో మొదటి అంశం గా పెట్టి ఊరురా బహిరంగ సభల్లో వాగ్దానాలు ఇచ్చి అది నమ్మి గుంప గుత్త గా ఓట్లు వేయించు కొని.. ఇప్పుడు కనీస కృతజ్ఞతభావం లేకపోవడం దుర్మార్గం అన్నారు ఎఫ్ఏపీటీఓ నాయకులు డి.శ్యామ్ మాట్లాడుతూ ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ లేని ఓపిఎస్ విధానానికి, మరి ఏ విధానం కూడా ప్రత్యామ్నాయం కాదని, యధాతథంగా ఓపిఎస్ మాత్రమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు వి.రమణ,భాస్కరరావు, షేక్ బుఖారి బాబు, పాల్తేరు శ్రీనివాసరావుతో పాటు ఫ్యాప్టో సంఘాల నాయకులు వై అప్పారావు కే జోగారావు, జెవిఆర్కే ఈశ్వరరావు, సదాశివరావు, డి.రాము, విజయ గౌరీ, తదితరులు పాల్గొన్నారు. ఏపీ సిపిఎస్ఈఏ నాయకులు గంటశ్రీనివాసరావు, స్టేట్ మీడియా ఇంచార్జ్అర్.శివ కుమార్ అధ్యక్షులు ధనుంజయ ,కె.ఈశ్వరరావు ఆర్థిక కార్యదర్శి గంట త్రినాధ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్ అప్పల నాయుడు ఫైనాన్స్ మెంబర్ బి.అనంత వైస్ ప్రెసిడెంట్మోహన్, .తిరుపతిరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా పిఆర్టియు నాయకులు డి.శ్రీనివాసరావు, రవీంద్రనాయుడు తదితరులు, జిల్లా విఆర్ఓ సంఘ నాయకులు యెస్.అప్పలనాయుడు, క్లాస్ ఫోర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గంగా ప్రసాద్, ఆపస్ నాయకులు జె.రామ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని బానాది గ్రామానికి చెందిన మహిళ ఏడువాక ముత్యమమ్మ(53) సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. ఇందుకు సంబంధించి వల్లంపూడి ఎస్సై కె. రాజేష్ స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి. బానాది గ్రామానికి చెందిన ఏడువాక ముత్యమమ్మ ఎప్పటిలాగే పొలం పనులకు వెళ్లి మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో ఇంటికి తిరిగి వస్తుండగా బానాది గ్రామానికి చెందిన శివాలయం సమీపంలో వెనుక నుండి వస్తున్న ట్రాక్టర్ ఒక్కసారిగా వెనుక వైపు నుండి ముత్యామమ్మను ఢీకొట్టడంతో రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ట్రాక్టర్ ఆతవ గ్రామానికి చెందిన లెక్కల ఈశ్వర రావు యజమాని డ్రైవర్ కాగా వల్లంపూడి ఎస్సై కే. రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.అలాగే మృతదేహాన్ని పంచినామ చేసి పోస్టుమార్టం నిమిత్తం శృంగవరపుకోట సిహెచ్సికి తరలించారు.

సత్యాగ్రహ దీక్షకు మద్దతుగా సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్ష

విశాలాంధ్ర-వేపాడ: విజయవాడలో రాష్ట్ర సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం చేపట్టిన సత్యాగ్రహ దీక్షకు మద్దతుగా వేపాడ మండల సమగ్ర శిక్షా ఉద్యోగులు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. సోమవారం మండల కేంద్రమైన వేపాడ విద్యా వనరుల కేంద్రం ముందు ప్లకార్డులు చేతపట్టి పలు డిమాండ్లతో కూడిన నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చాలని,పీఆర్సీ ప్రకారం ఎంటిఎస్, డిఏ, హెచ్ ఆర్ ఏ, అమలు చేసి వేతనాలు పెంచాలని, అలాగే ఈపిఎఫ్, ఈఎస్ఐ,సౌకర్యం కల్పించాలని, మెడికల్ లీవులు, చైల్డ్ కేర్ లీవులు మంజూరు చేయాలని, రూ.10 లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, పార్ట్ టైం ఉద్యోగులను ఫుల్ టైం లోనికి మార్చలని పలు డిమాండ్లతో కూడిన నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో వేపాడ మండల సిఆర్పిలు కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

అన్ని దానాల్లో కన్నా అన్నదానం మిన్న : కోళ్ల

విశాలాంధ్ర-శృంగవరపుకోట : అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న అని నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. టీడీపీ విశాఖ పార్లమెంటరీ గవర సాధికార సమితి సభ్యులు శిలపరశెట్టి అయ్యప్ప శేఖర్ ఆధ్వర్యంలో ఎస్.కోట పట్టణంలోని కోటవీధిలో ఏర్పాటు చేసిన మహా గణపతి మండపం వద్ద సోమవారం నిర్వహించిన అన్నదానం కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసారు. ముందుగా మహాగణపతికి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ శ్రేణులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట మండల పార్టీ అధ్యక్షులు జీ.ఎస్.నాయుడు, ఎస్.కోట పట్టణ పార్టీ అధ్యక్షులు కోనేదం మల్లేశ్వరరావు, సరిసా అప్పారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మహిళల సమస్యలు పరిష్కారం చేయాలి : ఐద్వా

విశాలాంధ్ర-బెలగాం: మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని అందుకు అనుకూలంగా విధానాలు ఉండాలని కోరుతూ ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా అక్టోబర్ 5 న ఢిల్లీలో మహిళా సంఘం భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నదని తెలిపారు. ప్రకాశం జిల్లాలో కన్న తండ్రి కూతురుని దారుణంగా హింసించి చంపారని, తాగుడు వ్యసనంతో ఇలాంటి దుర్మార్గాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, మహిళలపై అత్యాచారాలు, దాడులు పెరుగుతున్నాయని, మన జిల్లాలో కూడా అనేక ఘటనలు జరుగుతున్నాయన్నారు. బాధిత మహిళలకు రక్షణ భద్రత కల్పించాలని, వారికి పునరావాసాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. డ్వాక్రా మహిళలకు ఇస్తున్న రుణాల మొత్తానికి సున్నా వడ్డీ క్రింద జమచేయాలని, మద్యం షాపులు అనుమతులు రద్దు చేయాలని, డీ ఎడిక్షన్ కేంద్రాలు ప్రాంతీయ ఆసుపత్రిలో కూడా ఏర్పాటు చేయాలని, ఒంటరి మహిళలకు ఉపాధి రక్షణ కల్పించాల డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి.తులసి, ఎం.గౌరి, బి. జయలక్ష్మి, వై. సింహాచలమమ్మ పాల్గొన్నారు.